# సప్తసప్తతి
# జ్ఞానోదయ మందరము

రెండవ భాగము

శ్రీ సీతాపతయే శ్రీరామ చంద్రాయ నమః

# సప్తసప్తతి జ్ఞానోదయ మందరము

మహాయోగిని పోరూరి జ్యోతిర్మయి [1973-2011]

పమిడిఘంటం వెంకట సుబ్బారావు [1934-2014]

Never Born Never Died
Just Visited Planet Earth

మరణించనూ లేదు, జన్మించనూ లేదు,
భూగోళములో విహరించినారు.

***Donors***

*Surekha Koya*

*Supriya Koya*

*Roja Marneni*

*Ananth Mallavarapu*

*Natarajan Chidambaram*

*Dr. Vittal Janardhan*

*Vellanki Vijaya Lakshmi (1948-2020)*

*Vellanki Dattatreya Sharma (1939-1975)*

*Makina Kanaka Bhadram(1955-2012)*

*Makina Jhansi*

***Proof Readers***

*Roja Marneni*

*Srinivas Kumar Sistla*

***Artwork***

*Sujatha Koya*

***DTP***

*Jonnalagadda Sreenivas*

*Ramakrishna Saripalli*

***Book Designing***

*ColorPalette Designs*

***Printing***

*NG Solutions*

*Published, February 2021*

*Feedback & Contact:*

***sapthasapthathi@gmail.com***

# అంకితము

నా అభివృద్ధిని కాంక్షించి నాకు చదువు సంధ్యలు చెప్పించి నన్ను యీ ప్రపంచములో ఒక మనిషిగా నిలబెట్టుటకు కారకులైన

(1) కీ॥శే॥ శ్రీ అద్దంకి లక్ష్మీనరశింహారావు గారికి, వారి ధర్మపత్ని కీ॥శే॥ శ్రీమతి రంగమ్మగారికి (2) కీ॥శే॥ శ్రీ యిలపావులూరి వేంకట రమణయ్య గారికి, వారి ధర్మపత్ని కీ॥శే॥ శ్రీమతి అన్నపూర్ణమ్మ గారి పాద పద్మములకు ఈ కావ్యము అంకితము.

This is dedicated to Late Sri Addanki Lakshmi Narasimha Rao garu and his wife Late Smt. Rangamma Garu and

Late Sri Ilapaavuluri Venkata Ramanaiah garu - Asst. Director of Survey & Land Records and his wife Late Smt. Annapurnamma garu who provided me with education, feeding, clothing etc and made me to stand in the world as a man.

# అందులోని వుద్దేశ్యము

జన్మనిచ్చిన తల్లితండ్రులు పూజ్యులే, పూజనీయులే. అందుకు సందేహము ఏ మాత్రము లేదు. అలా అని అందరి తల్లితండ్రులు పూజనీయులా? అంటే నా నుంచి, కాదు అనే ఉత్తరము (సమాధానము) వస్తుంది. కారణం ఒకడు మొక్కనాటి, నాపని అయిపోయింది అనుకుంటే, దానికి ఎరువు వేసి, నీరు పోసి, చీడ తగలకుండా పెంచి పోషించిన వాడు, మొక్క నాటిన వాని కంటే యోగ్యత గలవాడు. అలాగే తండ్రి పది సంవత్సరముల వయసులో చనిపోతే, మరి నన్ను పెంచి, పోషించి, విద్యాబుద్ధులు నేర్పించి, నాకు జీవనోపాధి కల్పించిన వారు, కన్న తల్లితండ్రుల కన్నా నా దృష్టిలో మిన్న కదా! నా దృష్టిలోనే కాదు, లోకము దృష్టిలో కూడా అలాంటి దయామయులు గొప్పవారే. అందుకే నా కృతజ్ఞత తెలుపుటకు, ఈ కావ్య రచన వారి పాదపద్మములకు సమర్పించటమైనది. ఈ రచన కథానాయకుడు 'శ్రీరామ చంద్రమూర్తి' వారు ఏ లోకములోనున్నను వారికి కైవల్యము సిద్ధింపజేయాలని ప్రార్థిస్తున్నాను.


"మంగళ మహత్"

**పమిడిఘంటం వెంకట సుబ్బారావు**

# మంగళా శాసనము

“ నేనున్ కాళికిన్ బంటునైతినేని, కాళికిన్ నేను బిడ్డనైతినేని
నా జనకుండు రామభక్త పారవశ్యుండైతెనేని భాగవతుండైతెనేని,
లలితా పరాభట్టారికా నాకున్ పరమ గురువైతెనేని
ఈ కావ్యంబు సిద్ధించబడునౌదు లోకరక్షా ”

“ అంకమున “ పయిడిగంటము
వేంకటరమణ హరిదాసు ” విద్దెము లాడన్
పంకజ భవ హరిహరులకు
వంకలు దిద్దుదువు వీవు వరవరదాంబా! ”



***శ్రీ సీతాపతయే శ్రీరామ చంద్రాయ నమః***

## పదిహేనవ అధ్యాయము

# రామాయణములోని శూర్పణఖ పాత్ర విశేషాంశములు

శూర్పణఖ పదమును విశ్లేషించి పరిశీలిద్దాము. పంచబ్రహ్మాల అగ్నితత్వము విష్ణుగ్రంధిలో, బ్రహ్మగ్రంధిలోని రజోగుణముతో కూడిన పంచబ్రహ్మాల అంశ, పక్షి కర్మాచరణతో కూడిన బ్రహ్మగ్రంధిలోని మనస్సు, ఈ అంశలు కలిసి శూర్పణఖ అయినది. అంటే శూర్పణఖ దేహము లోపల పంచబ్రహ్మాలు ఉత్తరము నుండి దక్షిణము చేరారు గానీ, నారాయణి అంశలు దక్షిణము నుండి ఉత్తరము చేరలేదు. అందువలన శివశక్తుల సామరస్యము లోపించినది లేక లేదనే చెప్పవచ్చును. కావున మితిమీరిన వామాచారము కల్గిన అంశ శూర్పణఖ. పరిమితికి మించిన వామాచారము వలన శూర్పణఖ గోళ్లు, వాడియైన పక్షిగోళ్లుగా పరివర్తనము చెందినవి. అనగా నియంత్రణ లేని కుండలిని శక్తి ప్రసరణ చేతివేళ్ల ద్వారా జరిగి, శూర్పణఖ గోళ్లు పక్షిగోళ్లుగా మారినవి. కుండలిని శక్తికి నియంత్రణ లేదు, ఎంత పిండుకుంటే అంత దొరుకుతుంది, అని ప్రస్తావించుకున్నాము. సరిగ్గా ఇటువంటి అంశతో కూడినదే యక్షిణి అయిన తాటకి కూడా. తాటకిలో కూడా శివశక్తుల సామరస్యము అసమతుల్యము జరిగినది. తద్వారా పరిమితికి మించిన వామాచార కర్మాచరణ జరిగినది. పరిమితికి మించిన వామాచారము గానీ, పరిమితికి మించిన దక్షిణాచారము గానీ ప్రమాదకరమే.

> ***"తతః శూర్పణఖా నామ సంజజ్ఞే వికృతాననా,***
> ***విభీషణశ్చ ధర్మాత్మా కైకస్యాః పశ్చిమః సుతః."***

రావణ, కుంభకర్ణుల జననము తర్వాత, కైకసి విశ్రవసుల మూడవ సంతానముగా, వికృత ముఖము కలిగిన శూర్పణఖ జన్మించినది. కావున శూర్పణఖ రావణుని చెల్లెలు. ఇదే వంశములో పుట్టిన ఖర ధూషణ, కుంభకర్ణులకు కూడా చెల్లెలే. ఈమె భర్తను కోల్పోయి, విధవరాలై పుట్టింటికి చేరుతుంది. తన చెల్లెలు విధవ అగుటకు కారకుడైన రావణుడు ఈమెను చాలా అభిమానించాడు. ప్రేమగా చూచుకున్నాడు. రావణుని ప్రేమ, అభిమానము, రావణుని మద్దతు

శూర్పణఖకు విపరీతమైన స్వేచ్ఛ, స్వతంత్ర్యమును అందించినది. అందుచేత అడ్డు, ఆపు లేకుండా సంచరించినది. ఈ రోజులలో కూడ విధవలై, అత్తవారింట్లో ఇమడలేక పుట్టింటికి చేరి, వారికి లేని సంసార సుఖము మరొకరికి దక్కకూడదని పేచీలు పెట్టి, సంసారము నాశనము చేసేవారున్నారు. అట్టి వారందరికీ శూర్పణఖే ప్రేరణ.

మనకు ఒక ప్రముఖ వ్యక్తితో బాగా పరిచయమున్నది అనుకుంటే, మనము ఏమి చేసినాసరే, ఆ వ్యక్తి మనలని కాపాడగలడనే ధైర్యముంటే, అట్టి స్వేచ్ఛ మనచేత పాడు పనులను చేయిస్తుంది. ఇక్కడ కూడ రావణ, కుంభకర్ణ, ఖరధూషణాదుల అండ శూర్పణఖకు కొండంత అండగా మారినది. అందుకే రామలక్ష్మణులను పంచవటిలో చూచినప్పుడు కామరూపముతో వారి వద్దకు వెళ్లి

*"రావణో నామ మే భ్రాతా బలీయాన్ రాక్షసేశ్వరః,*
*వీరో విశ్రవసః పుత్రో యది తే శ్రోత్రమాగతః".*

అధికమైన బలము గలవాడు, వీరుడు, రాక్షసులకు రాజు, విశ్రవసు పుత్రుడు అయిన రావణుని గురించి వినియే వుందువు. అతను నాకు సోదరుడు. ఇక్కడ తనను గురించి చెప్పుకోవటములో నైతికత, వ్యక్తిత్వము కనిపిస్తుంది. కానీ శూర్పణఖ అధికముగా రావణుని గురించే ముచ్చటించినది. దీనికి కారణము, తన కోరిక తీర్చమనే బెదిరింపు. తీరకపోతే జరగబోయే ఆపద గురించి చెప్పే హెచ్చరిక. నా అన్న అంతటివాడు, కాబట్టీ నా కోర్కె తీర్చితే అండవుంటుంది, లేకపోతే అపాయమని బెదిరింపుగా చెప్పింది. నాకు అండ రావణుడొక్కడే కాదు, ఇంకా చాలామంది వున్నారు, చెప్తాను వినండి అని మొదలుపెట్టి

*"ప్రవృద్ధనిద్రశ్చ సదా కుమ్భకర్ణో మహాబలః,*
*విభీషణస్తు ధర్మాత్మా న తు రాక్షసచేష్టితః*
*ప్రఖ్యాతవీర్యౌ చ రణే భ్రాతరౌ ఖరధూషణౌ".*

ఎల్లప్పుడు అధికమైన నిద్రమత్తుగలవాడు, నిద్రపోయేవాడు, మహా బలవంతుడు అయిన కుంభకర్ణుడు, ధర్మములన్నీ తెలిసినవాడు, ధర్మము నాచరించేవాడు, రాక్షస ప్రవృత్తి లేని వాడయిన విభీషణుడు, యుద్ధము నందు ప్రసిద్ధమైన పరాక్రమము గలవారైన ఖరధూషణాదులు కూడా నా సోదరులే. ఈ విధముగా నా బలగము ఇంత మంది వున్నారు. నా కోరిక మన్నిస్తే వారంతా నీకు అండగా నిలుస్తారు. తిరస్కరిస్తే నీ కెంత అపాయమో, ఎంత హానికరమో తెలుసుకో అని రాముని బెదిరిస్తుంది.

***"శ్రూయతాం రామ వక్ష్యామి తత్త్వార్థం వచనం మమ***
***అహం శూర్పణఖా నామ రాక్షసీ కామరూపిణీ***
***అరణ్యం విచారామీదమేకా సర్వభయంకరా".***

నేను శూర్పణఖ అను రాక్షస స్త్రీ. కామరూపమును ధరించి ఈ అరణ్యములో సంచరించుదును. ఇక్కడ కామరూపము గురించి చర్చించవలసిన అవసరమున్నది. కామరూపము అంటే కోరిన రూపము ధరించగల్గుట. ఇది ఎలా సాధ్యపడుతుంది? కృతయుగము, త్రేతాయుగములో అధికశాతం దేహము ధరించిన ఆత్మలు, వారి ప్రసవము కూడ కాంతితో కూడినది. కలియుగ ఆరంభములో ప్రసవము గావించే ప్రక్రియ జలతత్వముతో కూడినది అయినది. త్రేతాయుగములో ప్రసవము కాంతితో కూడినది అగుటచే, దేహము ధరించిన ఆత్మలకు అధికముగా కాంతి ప్రసరణ వుండేది. సప్తవర్ణములను ఎన్ని రంగులుగానైన విభజన చేయవచ్చును. కావున వీరికి అనంత గుణములు వుండెడివి. ఈ కాలములో జల ప్రసవములో జన్యుపరమైన క్రోమోజోములతో కలిసి 24 గుణములు మాత్రమే సంక్రమిస్తాయి. కానీ కృతయుగము, త్రేతాయగుము, ద్వాపర యుగములో కాంతివంతమైన గుణములు వుండుటచే, అవి అపరిమితము అగుటచే, వారికి కామరూపము పొందే సామర్థ్యము వుండెడిది. కామరూప అంశతో ఎన్ని కోర్కెలనైన పండించుకోవచ్చును, ఆత్మశక్తిని వృద్ధి చేయవచ్చును. అలాగే ఈ అంశను దుర్వినియోగము కూడా చేయవచ్చును. రావణుడు, శూర్పణఖ, హనుమంతుడు, శబరి, గుహుడు, మంథర, కర్ణుడు ఈ కోవకు చెందినవారే. ఇరవైవ శతాబ్దపు ప్రముఖ శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, ఈ కామరూప అంశను ఆధారముగా చేసుకొనే భౌతిక శాస్త్రములో సూత్రమును ప్రతిపాదించాడు. $E=mc^2$. అంటే మన దేహము సూర్యకాంతి అంతటి వేగముగా ప్రయాణించగలిగితే, మన స్థూల దేహము అంతరించి, ఆ దేహములోని శక్తి అంతా కలయబడి ఒక మహాశక్తి అంశగా మారుతుంది అనే సూత్రమును ప్రతిపాదించాడు. మన శాస్త్రములను, సంస్కృత భాషను అభ్యసించిన ఆలబర్ట్ ఐన్‌స్టీన్‌కు, ఈ సూత్రమునకు ఆధారము, రామాయణములోని కామరూప అంశ ద్వారా లభించి వుండవచ్చును.

***"అహం ప్రభావసంపన్నా స్వచ్ఛన్దబలగామినీ,***
***చిరాయ భవ మే భర్తా సీతాయా కిం కరిష్యసి".***

నేను గొప్ప ప్రభావము గలదానిని. బలముతో స్వేచ్ఛగా సంచరించగలను. ఇష్టమున్న చోటికి, ఇష్టమైన రూపము ధరించి వెళ్లగలను. నాకు భర్తగా వుండి చాలాకాలము సుఖము, సౌఖ్యము, ఆనందము అనుభవించుము అని రామునితో చెబుతుంది. ఈ సీతతో ఏమిటి ప్రయోజనము? అని అడుగుతుంది శూర్పణఖ.

ఇక్కడ వున్న రహస్యాంశములను పరిశీలిద్దాము. నేను గొప్ప ప్రభావము గల దానిని, సీతతో ఏమిటి ప్రయోజనము అని ప్రస్తావించుట ద్వారా, సీతారాములు వివాహానంతరము, వనవాస కాలములో క్రీడించలేదు అని స్పష్టమగుచున్నది. వివాహమైన తర్వాత 25 సంవత్సరములు గడిచినా, సీతారాములు క్రీడించక పోవటానికి కారణమేమిటి? దీనికి కారణము ఒక్కటే. సీతలో దాగియున్న సృష్టిపోషణకు అవసరమైన గుప్తరూపముగా, అగ్ని గుండము వంటి కుండలినిశక్తి నిధి. ఇంతటి శక్తిని గ్రహించగలిగే వీర్యము గల భూతమే సృష్టిలో లేదు. ఒకవేళ క్రీడించి వుంటే, సీతలోని అగ్నిగుండము మహత్యమునకు రాముడు తప్పక భస్మము అయి వుండేవాడు. ఈ ప్రతిపాదనను ఈ విధముగా అర్థము చేసుకొనవచ్చును. ఒక విద్యుత్తు తీగెను అంటుకుంటే కాలిపోతాము. మరి అలాంటిది, విద్యుత్ శక్తి ప్రసరణ గావించే కేంద్రములోని మూల విద్యుత్ యంత్రమును అంటుకుంటే ఏమి జరుగుతుంది? ఇక్కడ కూడా అదే పరిస్థితి. అందువలన సీతలోని అగ్నిగుండము వంటి కుండలిని శక్తి నిధి, తిరిగి సృష్టి క్రమములో కలిపిన తర్వాతనే సీతారాములు క్రీడించుటకు యోగ్యత కలిగి వున్నారు. ఈ విషయములన్నీ ఒకవైపు అయితే, తనకంటూ ఏ కోరికలేని రాముడు ప్రమేయపూర్వకముగా సీతతో క్రీడించాలని అనుకోలేదు.

కామవాంఛతో కామరూపిణిగా విచ్చలవిడిగా సంచరిస్తున్న శూర్పణఖ తన మాయాశక్తి ద్వారా ఈ విషయము, ఏ విషయము? సీతారాములు క్రీడించుట లేదనే విషయము పసిగట్టినదై, రామునితో ఈ సీతవలన నీకేమిటి ప్రయోజనము అని ప్రశ్నిస్తుంది. రామాయణము మొత్తములో, సీతకు ఆవిర్భవించినప్పటి నుండి భూగర్భము చేరేవరకు, అత్యంత దుర్భర పరిస్థితి, అత్యంత గుప్తముగా వ్యవహరించుట, అమిత సహనము, అన్ని అవమానములను మౌనముగా స్వీకరించుట, ఇలాంటి పాత్రకు పోషణ చేయవలెనంటే సీతకే సాధ్యము.

***"వికృతా చ విరూపా చ న చేయం సదృశీ తవ,***
***అహమేవానురూపా తే భార్యా రూపేణ పశ్య మామ్".***

ఈ సీత వికృత రూపము కలది. అందగత్తె కాదు. వికారముగ కూడా వున్నది. ఈమె నీకు తగినది కాదు. నేనే నీకు తగిన భార్యను. నన్ను భార్యగా పొందుము అంటుంది శూర్పణఖ రామునితో.

***"ఇమాం విరూపామసతీం కరాళాం నిర్ణతోదరీమ్,***
***అనేన తే సహ భ్రాత్రా భక్షయిష్యామి మానుషీమ్".***

ఈ మానుష్య స్త్రీ వికృతమైనది. ఈమె స్వభావము కూడా చెడుగా వున్నది. భయంకరముగా వున్నది. అనగా సీతలో దాగివున్న గుప్తమైన, అంత గొప్పదైన కుండలిని శక్తి ప్రభావము వలన శూర్పణఖకు భయము కలిగి వుండవచ్చును. ఈమె పొట్ట అణిగిపోయి లోతుగా కూడా వున్నది.

నేను ఈమెను, నీ సోదరుని కూడా భక్షించెదను. అప్పుడు మనకు అడ్డము ఎవరు వుండరు అని బెదిరిస్తుంది, శూర్పణఖ.

అందుకు బదులుగా రాముడు, నాకు ఇంతకు పూర్వమే వివాహము అయినది. ఇప్పుడు నిన్ను పెండ్లి చేసుకుంటే, నీకు సవతిపోరు తప్పదు. ఏరికోరి సవతిపోరు ఎవరు భరిస్తారు? కాబట్టీ నా తమ్ముని భార్య ఇచ్చటలేదు. కనుక వానిని చేసుకుంటే నీవు సుఖముగా వుండవచ్చును. కాబట్టీ వాని వద్దకు వెళ్లమని చెప్తాడు, రాముడు. ఇక్కడ రాముడు తన ఏకపత్ని వ్రతమును, తనకంటూ ఏ కోరిక లేదనే లక్షణమును ప్రదర్శించాడు. ఆ విధముగా తన వద్దకు వచ్చిన శూర్పణఖతో లక్ష్మణుడు, నేను రాముని సేవకుడిని, నీవు నన్ను చేసుకుంటే నీవు కూడా సీతకు సేవకురాలివి కావలసి వుంటుంది. ఏరికోరి ఎవరైనా సేవకుని చేసుకుని సేవకురాలిని కావాలనుకుంటారా? ఆలోచించు అంటాడు. అప్పుడు శూర్పణఖ ఈ సీత మూలముగనే, ఈ రాముడు నన్ను ఇష్టపడుటలేదు. అందుచేత ఈ సీతను చంపితే రాముడు వశమౌతాడు, అనుకొని సీత మీదకు పోతుంది. అనగా సీతలో ఏదో తెలియని, గుప్తమైన అంశ వుందని, దాని ప్రభావము వలననే రాముడు సీతకు వశమైనాడని తెలుసుకొని, సీత మీదికి వెళ్లినది. అది గమనించిన రాముడు లక్ష్మణునికి సైగ చేయగా లక్ష్మణుడు శూర్పణఖ ముక్కు, చెవులను ఖండిస్తాడు.

*"ఇత్యుక్తో లక్ష్మణస్తస్యాః క్రుద్ధో రామస్య పార్శ్వతః,*
*ఉద్ధృత్య ఖడ్గం చిచ్ఛేద కర్ణనాసం మహాబలః".*

శూర్పణఖ ఏ విధముగా సీతను గురించి వికృత రూపము గలది అని రామునితో చెప్పినదో, ఆ విధముగనే తాను విరూపి అయినది. ముక్కు, చెవులు తెగిన శూర్పణఖ, తన విపరీత ప్రవర్తనకు కారణమైన కుండలిని శక్తి ఇడ, పింగళ, సుషుమ్న నాడుల ద్వారా తిరోగమనము చెంది, కుండలిని శక్తి నియంత్రించబడి, వామాచారము అంతమై జ్ఞానోదయము కల్గుటకు దోహదము చేసినవి. ఇది లక్ష్మణుని ప్రత్యేకత. ఇలాంటి చర్యే తాటకి మీద కూడా ప్రయోగించాడు. లక్ష్మణుడు ఆదిశేషుని అంశ. మన దేహములోని వారుణి నాడి ఆదిశేషుని అంశ. కాబట్టీ ఏయే నాడులను నియంత్రిస్తే కుండలిని శక్తి ప్రసరణ అరికట్టబడుతుంది అనే అంశము క్షుణ్ణముగా తెలిసినవాడు లక్ష్మణుడు. ఆయన కర్మాచరణ అంతా నాడీ వ్యవస్థ ఆధారముగనే జరుగుతుంది. అంతట శూర్పణఖ ఘోరముగా అరుచుకుంటూ, గోల చేస్తూ, ఏడ్చుకుంటూ ఖరధూషణాదుల వద్దకు వెళ్లుతుంది. వారు శూర్పణఖ స్థితికి కారణము అడుగగా

***"సింహెూరస్కం, మహాబాహుం, పద్మపత్రనిభేక్షణమ్,
ఆజానుబాహుం, దీప్తాస్యమతీవ, ప్రియదర్శనామ్.
గజవిక్రాన్తగమనం, జటామండల ధారిణమ్, సుకుమారం, మహాసత్త్వం,
పార్థివవ్యంజనాన్వితమ్ రామ మిందీవరశ్యామం కందర్ప సదృశప్రభమ్,
బభూవేంద్రోపమం దృష్ట్వా రాక్షసీ కామమోహితాః".***

సింహముతో సమానమైన వక్షస్థలము గలవాడు, గొప్ప బాహువులు గలవాడు, పద్మముల యొక్క రేకుల వంటి కన్నులు గలవాడు, మోకాళ్ల వరకు వ్యాపించిన చేతులు గలవాడు, తేజస్సుతో ప్రకాశించువాడు, ఏనుగువలే హుందాగా నడుచువాడు, జటా మండలము అనగా ఋషివలే కేశములను ముడివేసినవాడు, సుకుమారుడు అనగా శరీరము మొఅటుదేలక, నునుపుగా వుండి శరీరము ఛాయతో మెరుపు కనపరచువాడు, మహాబలవంతుడు అయిన రాముని రూపమును, ఒక పర్యాయము చూచినంతనే, కందర్పసదృశ్యం, మన్మధునికే మన్మధుడు, భూమి మీద ఇంద్రునితో సమానమైన రాముని చూచినంతనే కోరిక కలిగి, ఏ కోరిక? ఆయనను భర్తగా పొందాలనే కోరిక కల్గి, ఆ మంగళ విగ్రహ రూపమునే మరల మరల జ్ఞప్తి తెచ్చుకున్నది శూర్పణఖ. రాముని చక్కదనము, ఆ కన్నుల సౌందర్యము మరవాలన్న మరువ లేకపోయినది. అంతలా శూర్పణఖలో మోహము ఆవహించినది. ఆ బలిసిన చేతులతో తనను కౌగిలించుకుంటే కలిగే ఆనందము స్మరించుకుంటూ, రాముని చేతులను గురించి ముందుగా రెండు పర్యాయములు, ఆజానుబాహు, మహాబాహు అని వర్ణించినది.

ఈ శ్లోకములో అనేక విశేషాంశములున్నవి. ముందుగా శూర్పణఖలోని కైకసి లక్షణములు అయిన కామవాంఛ వ్యక్తమైనవి. రాముని సింహముతో సమానమైన వక్షస్థలము అని చెబుతుంది. సింహము లక్షణము ఏమిటి? ఎల్లప్పుడు తృప్తిగా వుండటమే. తనకు కావలసిన ఆహారము నిర్భయముగా వేటాడి ఆరగించి, రుచి మరిగి తృప్తి చెందుతుంది. కోరికలకు అతీతుడైన రాముడు కూడా ఎల్లప్పుడూ తృప్తిగా వుండుటచే అడవిలో సింహము వంటి వానిగా శూర్పణఖకు కనిపించాడు. ఈ కోరికలకు అతీతమైన స్థితి ద్వారానే మన్మధునికే మన్మధునిగా, ఇంద్రునివలే కూడా శూర్పణఖకు అగుపించాడు. వామాచారములో నిష్ణాతురాలైన శూర్పణఖ, ముక్కు చెవులు ఖండించబడి, వామాచారములో పరిపక్వత దశకు చేరుకుని, మోహము చెందినది. అనగా శూర్పణఖలో అంగారకుని మాయ ప్రవేశించినది.

ఇక్కడ శూర్పణఖ తుమ్మెదయై పద్మము వంటి రాముని కొరకు వెతుకుచూ, రామునికి వశమైనది. అంతేకాదు శూర్పణఖ అపరవిద్య కూడ ప్రదర్శించినది. అనగా నీవు నేను వేరుకాదు అనే అద్వైత స్థితితో కూడిన వామాచారము. అపర వశీకరణ విద్యను భక్తితో, సేవాభావముతో,

ప్రేమతోనే కాకుండా కామవాంఛతో కూడ ప్రదర్శించవచ్చు అని శూర్పణఖ నిరూపించినది. శూర్పణఖ రామునికి వశమైనది కాని, రాముడు శూర్పణఖకు వశము అవలేదు. ఎందులకు? అప్పటికి రాముడు అపరవిద్యలో ఇంకనూ ఉత్తీర్ణుడు అవలేదు. అనగా ఇంకా పరవిద్యలోనే వున్నాడు. రామునికి శబరి ద్వారా అపరవిద్య అభ్యాసము లభించినది. అందుకే శూర్పణఖతో, నీకు నేను పరమైన వాడను, సీతకు వశమైన వాడను. లక్ష్మణుని వద్దకు పొమ్మని సూచించాడు. తర్వాత శూర్పణఖ, ఖరునితో రాముని గురించి యిలా చెబుతుంది.

***"తరుణౌ రూపసంపన్నౌ సుకుమారౌ మహాబలౌ,***
***పుణ్డరీకవిశాలాక్షౌ చీరకృష్ణాజినామ్బరౌ.***
***ఫలములాశనౌ దాన్తౌ తాపసౌ ధర్మచారిణౌ***
***పుత్రౌ దశరథస్యాస్తాం భ్రాతరౌ రామలక్ష్మణౌ."***

తరుణులు అనగా యువకులు, మంచి వయస్సులో వున్నవారు, చూడ ముచ్చటైన వారు, మహాబలవంతులు, అంటే ఎంత బలము? కుండలిని శక్తికి పరిమితి లేదు, మన సంకల్పమే పరిమితి, కావున ఎంతైనా కావచ్చు, పెద్దపులి వంటి విశాలమైన నేత్రములు గలవారు, తాపసులు, ధర్మమును ఆచరించువారు, అనగా దేశకాల పరిస్థితులను అనుసరించి నడుచువారు, ధర్మమార్గమున నడుచువారు, అయిన అన్నదమ్ములు రామలక్ష్మణులు అనే దశరథ కుమారులు. ఇక్కడ కొన్ని అంశములను పరిశీలిద్దాము.

తరుణౌ అనగా మంచి వయసులో వున్నవారు. తరుణౌ అంటే తమో గుణములను చిత్తముచే విచక్షణ గావించి, మనస్సు ద్వారా కర్మాచరణ గావించువారు. ఇటు మరీ బాలకులు కారు, అటు మరీ ముదుసలులు కారు. ఇప్పుడు వారి వయస్సు ఎలా నిర్ణయము చేయాలి?

దశరథుడు విశ్వామిత్రునితో

***"ఊనషోడశవర్షో మే రామో రాజీవలోచనః,***
***న యుద్ధయోగ్యతామస్య పశ్యామి సహ రాక్షసైః".***

పదహారు సంవత్సరములు కూడా నిండని రాముడు, రాక్షసులతో యుద్ధము చేయటానికి యోగ్యుడు కాడు. లంకలో సీత హనుమంతునితో

***"సీతేతి నామ నామ్నాహం, భార్యా రామస్య ధీమతః,***
***సమా ద్వాదశ తత్రాహం రాఘవస్య నివేశనే."***

సీత అను పేరు గల నేను, వివాహానంతరము అయోధ్యలో రాముని గృహములో పన్నెండేళ్ళు కాపురము చేసాను. సీత రావణునితో

*"మమ భర్తా మహాతేజా వయసా పంచవింశకః,*
*అష్టాదశ హి వర్షాణి మమ జన్మని గణ్యతే".*

పట్టాభిషేక భంగము నాటికి అనగా అరణ్యమునకు వచ్చునాటికి, నా భర్త మహాతేజ సంపన్నుడైన రాముని వయస్సు 25 సంవత్సరములు, నా వయస్సు 18 సంవత్సరములు. మారీచుడు రావణునితో

*"బాలో ద్వాదశవర్షోయమకృతాస్త్రశ్చ రాఘవః,*
*కామం తు మమ యత్సైన్యం మయా సహ గమిష్యతి."*

రాముడు పన్నెండు సంవత్సరముల ప్రాయములో పూర్తిగా అస్త్రవిద్య నేర్వని వయస్సులో, నన్ను నా సహచరులను తరిమికొట్టాడు. ఇప్పుడు రాముని వయస్సు

వివాహ సమయమునకు - 13 సంవత్సరములు

వివాహానంతరము అయోధ్యలో కాపురము - 12 సంవత్సరములు

అరణ్యవాసము - 13 సంవత్సరములు

అనగా శూర్పణఖ చూచిన నాటికి రాముని వయస్సు 38 సంవత్సరములు. అంటే తరుణులు తగిన వయస్సులో వున్నవారే కదా! అందునా నియమ నిష్టలతో, శరీర పుష్టిగలవాడు.

**రూపసంపన్నౌ** - రూపము, ఆకారము, కన్ను ముక్కు తీరు, అవయవముల పొందిక, ఏ అవయవములు ఎక్కడ ఏ తీరులో, సాముద్రిక శాస్త్ర ప్రకారము వుండాలో అలా వుండుట వలన, ఆ వ్యక్తి చూపరులకు, చూచేవారిని ఆకర్షిస్తాడు. ఈ ఆకర్షణకు గురైన శూర్పణఖ తుమ్మెదై రామునిపై వాలినది. 'పుంసాం మోహన రూపాయ' అని కదా! అంటే పురుషులను కూడా మోహింపచేసి, వశపరుచుకునే సౌందర్యము గలవాడు. కృష్ణుడు తన వేణుగానముతో శిశువులను, పశువులను, గోపకన్యలను, యశోదను చివరకు కంసుని, విష పూతనను కూడా మోహింపచేసాడు. రాముడు తన కన్నులతో, చూపులతో, ప్రవర్తనతో అందరినీ మోహింపజేసాడు.

**సుకుమారౌ** - సుకుమారుడు అంటే ఏ మాత్రము కష్టము తెలియనివాడు, కష్టపడనివాడు, తేరగా తిని కూర్చునేవాడు, సుఖముగా అల్లారుముద్దుగా పెరిగినవాడు. కానీ రామలక్ష్మణులు కష్టము తెలియనివారు కాదు. కష్టపడని వారు కాదు. రాజపుత్రులు గనుక విద్యాభ్యాస సమయములో కత్తిసాము, ధనుర్విద్యా, గజారోహణము, అశ్వారోహణము చేసినవారే. శూర్పణఖ చూసినప్పటికి పదమూడు సంవత్సరములుగా అరణ్యములో వుండి ఎండ, గాలి, చలి, వర్షము లాంటి వాతావరణ పరిస్థితులలో వున్న రామలక్ష్మణలు, శూర్పణఖకు రూప సౌందర్యవంతులుగా

కనపడ్డారు అంటే అది ఎలా సాధ్యము? అందరికీ అలా శరీరము కాపాడుకొనుట సాధ్యమా? ఆ శరీరకాంతి అయోధ్యలో వున్నా, అరణ్యములో వున్నా ఏమాత్రము తేడా లేదన్నమాట. శీతోష్ణ స్థితులు వారి శరీరము మీద ఎలాంటి ప్రభావము, మార్పు కలిగించలేకపోయినవి. వీటికి కారణము వారి కుండలిని శక్తి, వారు సాక్షీభూతత్వముతో ఆచరించే కర్మ.

**మహాబలౌ** – పైన సుకుమారులు అని చెప్పాము గదా! అంటే అర్భకులా? ఓపిక లేనివారా? బలము లేనివారా? కష్టము తెలియని వారా? కాదు! ఎంత సుకుమారముగా కనిపిస్తారో అంత మహాబలవంతులు. మహా అంటే ఎంత? పరిమితి, కొలత ఏమిటి? తాటకిని సంహరించునపుడు, తాటకి బలము అధిగమించేటంత, సుబాహును సంహరించేటప్పుడు, సుబాహు బలము అధిగమించేటంత, శివధనుర్భంగము చేసేటపుడు ఐదువేల మంది మోసుకొచ్చిన ధనుస్సును విరిచేటంత, ఖరధూషణాది పద్నాలుగు వేలమంది యొక్క బలము, శక్తి, అస్త్రవిద్యను అధిగమించేటంత. దీనిని బట్టీ రాముని బలము విరోధి బలముకంటే ఎల్లప్పుడు అధికముగా వుంటుంది. దీనికి కారణము తన సంకల్పముచే, కుండలిని శక్తిని ప్రజ్వలించి, ఆ శక్తితో విరోధిని శక్తిహీనుని గావించి, మరల తాను శక్తివంతుడు అగుట ద్వారా విరోధి బలమును అధిగమించగలుగుతున్నాడు. ఈ ప్రక్రియలోని పూర్తి విశ్లేషణ శివధనుస్సు విరిచే ఘట్టములో చెప్పబడినది.

**పుండరీక విశాలాక్షౌ** – పెద్దపులి వంటి వెడల్పయిన కన్నులు గలవాడు. కన్నులు ఎంత విశాలముగా వుంటే, చూచేవారికి అంత ఆకర్షణ, ముఖానికి అందము వస్తుంది. పుట్టపర్తి నారాయణాచార్యులు చెప్పినట్లుగా, ఈ పదము మహావిష్ణువుకే తగినది. మహావిష్ణువు తన శక్తిచేత లోకాలన్నిటినీ రక్షిస్తుంటే, రాముడేమో క్షత్రియుడు, మానవునిగా, రాజకుమారునిగా, భూలోకమును, అందులో విశేషించి రాక్షస నివాసమైన దండకను, అందులో మునులను రక్షిస్తున్నాడు. 'సా విష్ణు పృథివీ పతిః' అని కదా పాఠ్యము. విష్ణ్వాంశ లేనివాడు రాజు కాలేడు. ఈ కారణము చేతనే మన దేహములోని విష్ణుగ్రంధి రజో గుణమును, భూతత్వమును సూచిస్తున్నది. రాజు అంటే జగతీకందాలోని రజోగుణము కల్గినవాడని అర్థము. రామునిలో రెండు రకముల విష్ణ్వాంశలున్నవి. విష్ణువే వరాహాంశతో రామునిగా అవతరించాడు. మరలా రాజుగా, రాజ్యపాలకునిగా విష్ణ్వాంశ పొందాడు. అందుకే 'దండకారణ్య కర్తనః' అని రామాష్టోత్తర శతనామ స్తోత్ర పాఠము. అంటే దండకలో శిష్టులను రక్షించటము, దుష్టులను శిక్షించటము ద్వారా క్షత్రియ ధర్మము, రాజధర్మము నిర్వర్తించువాడని అర్థము. ఇదే సందర్భములో

*"కలవన్ దావక ఖడ్గఖండి తరిపుక్షా భర్త మార్తాండు మం*
*డల భేదంబొనరించి నేగనెడ తన్మధ్యంబునన్ హార*
*కుండల కేయూర భూషితుని శ్రీమన్నారాయణుంగాంచి లో*
*గలగం బారుచు నేగే నీవయని కృష్ణరాయధిపా"*

ఇది తెనాలి రామకృష్ణ కవి చాటువు. అలా విష్ణ్వాంశ రాజులో వుంటుంది. శ్రీకృష్ణదేవరాయుల చేత యుద్ధములో చంపబడిన శత్రురాజులు, సూర్యమండలము ద్వారా స్వర్గము చేరుతూ, మార్గమధ్యములో సూర్యమండలము నందు హార, కిరీట, కేయూరము ధరించిన శ్రీమన్నారాయణుని జూచి, కృష్ణదేవరాయలే మరలా దర్శన మిచ్చాడని భయముతో ప్రక్క ప్రక్కగా వొదిగి వెళ్లినారట. ఇక్కడ శ్రీకృష్ణదేవరాయలే విష్ణువు, విష్ణువే శ్రీకృష్ణదేవరాయలని చెప్పుచున్నాడు, తెనాలి రామకృష్ణ కవి. ఇది రాజభక్తి చాటే విధానము.

**చిరకృష్ణా చీనాంబరౌ** – ఇంత రూపము సంపద గలవారు కదా! మరి వారికి ఆ రూపసంపద ఎలా కలిగినది? వస్త్రధారణ వల్లనా? వారికి చీని చీనాంబరములు లేవు. వున్నదల్లా నారచీరలే. అయినా వారు రూపసంపన్నులే. రూపసంపన్నులుగానే శూర్పణఖకు కనిపించారు. అంటే వస్త్రధారణ వలన గానీ, వాతావరణ మార్పుగానీ వారి శరీరములో, రంగులో, నునుపులో, మెరుపులో ఎలాంటి మార్పు కలుగజేయలేదు. కలుగజేయలేక పోయినది. అంటే అయోధ్యలో వుండి పట్టువస్త్రాలు ధరించినా, అడవిలో తిరిగి, చలి, వాన, ఎండలకు గురై నార చీరలు ధరించినా వారి సౌందర్యములో ఎటువంటి మార్పులేదు. అందుకే 'చక్కనమ్మ చిక్కినా అందమే, సంగీతము వచ్చినమ్మ ఏడ్చినా' బాగానే వుంటుంది అనే సామెత ఏర్పడినది.

**ఫలమూలాశినౌ** – ఇంత గొప్ప రూప సంపదగలవారు, బల సంపద గలవారు, సుకుమారమైన శరీరము గలవారుకదా! వీరు ఎలాంటి ఆహారము తీసుకుంటున్నారు? మహారాజులు తినే ఆహారమా? కాదు. అడవిలో వారికి అలాంటి ఆహారము ఎలా దొరుకుతుంది? అడవిలో వారికి దొరికేది కందమూలములు, దుంపలు, కాయకసురులు గదా! అప్పటికి పదమూడు సంవత్సరముల నుండి అలాంటి ఆహారము తీసుకున్నా, నారచీరలు ధరించినా, అడవిలో ఎండ, వాన, చలికి తిరిగినా, వారి శరీర సౌష్టవము రూపసంపద బలసంపద ఇంత చక్కగా కాపాడుకున్నారంటే ఎలా సాధ్యము? అలా వుండటానికి ఆహారమొక్కటే కారణము కాదు. ఆహారము, ఆహారముతోటి విహారము, అలవాట్లు, నిర్ణీత సమయములో క్రమము తప్పని వ్యాయామము, జాగ్రత్తలు, వ్యాయామమును బట్టీ ఆహారము, ఆహారమును బట్టీ వ్యాయామము. ఇలా సమతుల్యము పాటించుట ద్వారా శరీర ఆరోగ్యమును ఎలా కాపాడుకోవాలో, కాపాడుకోవచ్చునో, రాముడు మానవ మాత్రునిగా పుట్టి, కర్మాచరణ ద్వారా ఆచరించి, మనందరికి సందేశము, ఉపదేశము అందించాడు. ఈ విషయమును

శూర్పణఖ ద్వారా వాల్మీకి వారు మనకు మార్గము చూపాడు.

**దాంతౌ** – ఇంద్రియ నిగ్రహము గలవారని అర్థము. ప్రతి మనిషికి మనస్సు అనేది ఒకటి వుంటుంది. దానికి అనుసందించిన జ్ఞానేంద్రియములు బుద్ధి, చిత్తము, అహంకారము, కర్మేంద్రియములు, కన్ను, ముక్కు, చెవి, నాలుక, దంతములున్నవి. కర్మేంద్రియముల ద్వారా బయట ప్రపంచములో విషయములను చూసి, మోహించి, వాటి అనుసందాన జ్ఞానేంద్రియముల కేంద్రానికి వర్తమానము అందజేస్తాయి. వాసన ద్వారా నాసిక రంధ్రములు, చూడటం ద్వారా కన్నులు, వినటం ద్వారా చెవి, రుచి ద్వారా జిహ్వ, దంతములు వాటి వాటి కేంద్రస్థానములకు వర్తమానము పంపుతాయి. తద్వారా మనసులో వీటిపై కోరిక జనిస్తుంది. అవి పొందాలనే భావన కలుగుతుంది. అవి పొందటానికి కర్మాచరణ ద్వారా ప్రయత్నిస్తాము. దక్కకపోతే దుఃఖము, కోపము, ఈర్ష్య, అసూయ ఇలా ఒకదాని వెనుక మరొకటి అహంకారము అనగా, వ్యక్తిత్వములో ముద్రవేస్తాయి. దీనికి ఉదాహరణ శూర్పణఖ కామవాంఛతో కూడిన వామాచార కర్మాచరణ, తద్వారా కల్గిన కోపము, ఆమె అహంకారములో నాటుకున్నాయి.

ఇలా వేర్వేరు ఇంద్రియములను వాటి పరధిలో వుంచి, ఎంతమేరకు వాటి కేంద్రస్థానములతో వర్తమానము పంపవలెనో అంతమేరకు పంపేవానిని, ఇంద్రియములకు దాసుడు కాకుండా, వాటిని తన వశములో వుంచుకునేవాడు దాంతుడు. దాంతౌ పదమును విశ్లేషిస్తే, విశుద్ధి చక్ర కమలము రుద్రగ్రంధిలో లయమవగా, వ్యక్తమయిన తమో గుణములు ఆజ్ఞాచక్రము ఉత్తరమునకు చేరుట అని అర్థము. విశుద్ధి చక్ర యంత్రము రుచులను విశ్లేషణ చేసే యంత్రము. పదహారు దళములతో కూడిన పద్మము. అటువంటి విశుద్ధి కమలము రుద్రగ్రంధిలో లయమయిన తర్వాత వ్యక్తమయిన తమో గుణములు సహస్రారము చేరినవి అంటే, రుచులకు అతీతమైన వాడని అర్థము. నిజమే మరి! రాముడు ఎప్పుడూ కూడా గుంటూరు గోంగూర పచ్చడి కావాలని లేక నేతి బొబ్బట్లు కావాలని అడుగలేదు. తనకంటూ ఏ కోరికలేనివాడు రుచులకు అతీతుడు, దాంతౌ అయినాడు. రాముని విషయములో ఇంద్రియ రుచులు ఏమీ పనిచేయలేదు.

ఆయన సీతా కళ్యాణము తర్వాత దాదాపుగా 25 సంవత్సరములు తన భార్య అయిన సీతతో క్రీడించకపోయినా, విరోధి చెల్లెలు, రాక్షస స్త్రీ అయిన శూర్పణఖ, కామరూపము ధరించి, అందముగా కనపడి, మోహించి దరిచేరి ఉత్తేజపరిచినా, రామలక్ష్మణులలో, వారి ఇంద్రియములలో రవ్వంత మార్పులేదు. అలాంటి శూర్పణఖను తిరస్కరించారు, వారు చెక్కు చెదరలేదు. అందుకే శూర్పణఖ రామలక్ష్మణులను గురించి 'దాంతౌ' అని శ్లాఘించినది ఖరునితో. అంతటి ఇంద్రియ నిగ్రహము గలవాడు కనుకనే రాముని 'జితక్రోధో', 'జితామిత్ర', 'జితేంద్రియ' అని స్తుతిస్తాము. జితేంద్రియ అనగా ఇంద్రియములను జయించినవాడు. వశములో వుంచుకొనువాడు. ఈ ఇంద్రియ

విషయములలో కామక్రోధాది అరిషడ్వర్గాలు కూడా వున్నవి. అయితే రామునికి క్రోధము లేదా? లేకుంటే ఖరధూషణాదులను, కుంభకర్ణుని, రావణుని, వాలిని ఎలా చంపాడు? రాముడు క్రోధాతీతుడు కావున, క్రోధమును ఒక సాధనముగా వాడుకుంటాడు. తప్పు చేసిన వారిపట్ల క్రోధము ప్రదర్శించి, ఆ తప్పులకు గురైన వారి దరి చేరి, శాంతిని పొంది ఉపశమనము పొందుతాడు. అందుకే 'కస్య భిభ్రతి దేవాస్య జాతరోషస్య సంయుగే' అన్నారు. రామునికి కోపము కల్గినపుడు, మిత్రులయిన దేవతలు కూడా భయపడతారు. శత్రువుల విషయము ఇక చెప్పనవసరము లేదు. రామునికి కోపము లేదనుకుంటే ఎవరినీ శిక్షించకుండా వుండాలి. అంటే 'అహింసా పరమోధర్మః' అనే సూత్రాన్ని పాటించాలి. కానీ అహింసను అంటుకొని హింస చేసే వాడిని శిక్షించకుండా వదలిపెడితే, దాని ఫలితము రాజునకు, రాజ్యపాలకునికి అంటుతుంది. కావున ఎలాంటి హింస ప్రవృత్తి లేని వాని పట్ల అహింస చూపుతూ, హింస చేసేవాని పట్ల అహింస పేరుతో ఊరుకోకుండా సమన్యాయము చేయువాడు రాముడు. పది మందికి, వంద మందికి, వేల మందికి కష్టము కలిగించే వానిని శిక్షించుట హింస కాదు. ఈ ప్రతిపాదననే విశ్వామిత్రుడు రామునితో

> ***"న హి తే స్త్రీవధకృతే ఘృణా కార్యా నరోత్తమ,***
> ***చాతుర్వర్ణ్యహితార్థాయ కర్తవ్యం రాజసూననా".***

ఓ నరశ్రేష్టుడా! నాల్గు వర్ణాల వారికి మేలు జరుగుటకు, మేలు కల్గుతుందని నమ్మకముంటే, స్త్రీని వధించుట పాపము కాదు. పైగా అలా చేయటము రాజకుమారుడవైన నీ ధర్మము, నీ కర్తవ్యము. అందులో తప్పు లేదు. నీకు ఎటువంటి దోషము అంటదు. కాబట్టీ తాటకిని సంహరింపుము.

ఈ ప్రతిపాదనను పాటించిన రాముని అనుసరించి మనము కూడా పాటించవలెనని ఆలోచించినపుడు, గాంధీ అహింసా సిద్ధాంతము, బుద్ధుని అహింసా సిద్ధాంతము వీగిపోతాయి. ఈ సిద్ధాంతముల కారణముగా ఎంతో మంది నిరాశ్రయులైనారు. ఎంతో మంది మహిళలు విధవలైనారు. ఎంతో మంది పిల్లలు అనాధలైనారు. ఎన్నో ఇండ్లు, ఆస్తులు నాశనము అయినవి. ఈ సిద్ధాంతమును నమ్మి పాటించిన ప్రభుత్వము కూడా సైన్యమును దౌర్బల్యముగా చేసి, కొన్ని వేల మైళ్ల భూభాగము పొరుగు దేశాలకు ధారాదత్తము చేయటము జరిగినది. ఇది అహింసా సిద్ధాంతము పాటించినందుకు జరిగిన ఫలితము. అయితే కొందరు దేశభక్తులని, మరికొందరు దేశద్రోహులని పిలవబడుతున్నారు. దీనికి ఆధారము ఏమిటి? బ్రిటీష్ ప్రభుత్వము దృష్టిలో

నెహ్రూ, గాంధి, రాజాజి, పటేల్, ప్రకాశం తదితరులు దేశద్రోహులే కదా! మరలా స్వతంత్రము వచ్చిన తర్వాత వారే దేశభక్తులైనారు. ఇప్పటి దేశద్రోహులు, ప్రభుత్వము మారితే దేశభక్తులుగా పిలవబడతారు అని తెలుస్తున్నది.

**తాపసౌ** – తపన పడేవారిని తాపసులు లేక తాపసి అందురు. దేనికొరకు తపన? ఈ తపన గురించి రాముని గుణములలో వివరింపబడినది. అయితే  సీతాకళ్యాణము జరిగిన అప్పటి నుండి రామునికి వకటే తపన, ఏమిటది? సీతను, సీతలో దాగిన అగ్నిగుండము వంటి కుండలిని శక్తి నిధి నుండి ఎలా విముక్తురాలను చేయవలెననే తపన, సృష్టి సంతులనను పునరుద్ధరించే తపన, భరతఖండములో ప్రబలుతున్న అసహనమును సరిదిద్దే తపన. అటు తర్వాతనే వారిరువురి దాంపత్యమునకు ఒక ప్రయోజకత్వము చేకూరుతుంది. వారిరువురి అర్ధనారీశ్వర తత్వము ప్రకటితమవుతుంది.

**ధర్మచారిణౌ** – ధర్మ మార్గము నందు న్యాయమైన రీతిలో నడిచేవారు, అనుసరించేవారు. రాముడు ఒక భార్య వుండగా మరొకరిని స్వీకరించుటకు నిరాకరించాడు. మరి లక్ష్మణుడో భార్య వద్ద లేకపోయినా, బ్రహ్మచర్యములో గడిపాడు కానీ మరొకరిని స్వీకరించలేదు. లక్ష్మణుడు రామ సేవకుడు గనుక, భార్య ప్రక్కన వుంటే సేవకు ఆటంకమని, భార్యను వెంట అడవికి తీసుకురాలేదు. అలాగే తన మాట మన్నించి, ఇంటి వద్ద వున్న భార్యకు అన్యాయము చేసినట్లు అవుతుందని శూర్పణఖను తిరస్కరించాడు. దీనిని దృష్టిలో పెట్టుకొని 'ధర్మచారిణౌ' అని వుంటుంది శూర్పణఖ, ఖరునితో. రాక్షసులలో అలా కాదు. వారికి ధర్మమేదో, అధర్మమేదో తెలియదు. స్వార్థము తప్పితే. రావణుడు సీతతో, 'పరస్త్రీలను అపహరించుట, వారిని అనుభవించుట, యజ్ఞములను ధ్వంసము చేయుట, మునులను, ప్రజలను, ధర్మమార్గములో నడిచే వారిని పీడించుట, ఇవన్నీ రాక్షస ధర్మాలు, ఇవన్నీ వారి స్వకార్యాలు, ఇవి వారికి తప్పుకాదు' అని చెప్పి తను చేసిన పాడు పనులను సమర్థించుకున్నాడు.

రాముని సౌందర్యము ఇంత వివరముగా వర్ణించిన శూర్పణఖ ఇంతకు వారెవరో, వారి పేర్లేమిటో చెప్పలేదు.  కారణము వారి గుణములు, రూపములు మనసులో వూహించి, మోహించి తన్మయత్వములో వున్నది. ఇక ఇప్పుడు చెబుతుంది, వారి పేర్లు. వారిద్దరూ అన్నదమ్ములు, దశరథ కుమారులు, రామలక్ష్మణులు అని ముగించినది. ఇంత చక్కగా, ఇంత ఇంపుగా, ఇంత గాఢముగా రామలక్ష్మణుల రూపము మనసులో నిలుపుకొని, వారి గుణగానముతో పరవశమై, సామగానాలాపన చేసిన శూర్పణఖ కనీసం విరోధి భావముతోనైనా రామలక్ష్మణులను తలచినది. మరి ఏ లోకానికి పోయినదో గదా చచ్చి.

**'బాంధవమునైన, పగనైన, భీతినైన, ప్రాణభీతినైన, భక్తినైన, హరికి పరతంత్రులగు జనులు మహాయోగుల కందరాని మోక్ష పదవికి జనుదురధిప'** అని కదా పోతనగారి భాగవత పాఠ్యము. అయితే ఇక్కడ 'హరికి పరతంత్రులగు' అని పోతనగారు చెప్పుటచే, ఈ కోవకు చెందిన వారందరు అనగా శూర్పణఖ, రావణ, కుంభకర్ణ తదితరులు, అంతేకాదు సేవ, భక్తి, స్నేహము చివరకు గురుస్థానములైన గుహుడు, శబరి, జటాయువు, విశ్వామిత్రుడు అందరూ అపరవిద్యచే రామునికి వశమైనారు. కానీ రాముడు పరవిద్య ఉపాసన ద్వారా వారందరిని పర అనగా వేరుగానే చూసాడు. శబరి, జటాయువు, గుహుడు, హనుమంతులను మాత్రము అపరతత్వము అనగా మీరు నేను వేరుకాదనే భావనతో చూసాడు.

ఈ విధముగా శూర్పణఖ, ఖరుని ఉద్రేకపరిచి, రామలక్ష్మణుల మీదకు పంపి, ఖరుని మరణానంతరము, రావణుని వద్దకు పోయి,

***"ప్రమత్తః కామభోగేషు స్వైరవృత్తో నిరఙ్కుశః,***
***సముత్పన్నం భయం ఘోరం బోద్ధవ్యమ్ నావబుధ్యసే".***

రావణా! నీవు చాలా అజాగ్రత్తగా వున్నావు. కామభోగాలలో చిక్కుకున్నావు. ఇంతవరకు ఎందరో స్త్రీలను తెచ్చినా నీకు తృప్తిలేదు. ఇంకా ఇంకా స్త్రీల కొరకు వెంపరలాడుతున్నావు. ఇష్టము వచ్చినట్లుగా ప్రవర్తిస్తున్నావు. ఇంద్రియ లోలుడవై, అవి ఆడించినట్లుగా ఆడుతున్నావు. నిరంకుశముగా ప్రవర్తిస్తున్నావు. ఎవరికి ఏమీ చెప్పే అవకాశమివ్వటము లేదు. ఎవ్వరినీ దగ్గరకు రానివ్వటము లేదు. గానా భజానాపరులను మాత్రమే ఆశ్రయించి వున్నావు. వాస్తవము నీకు రుచించుట లేదు. అందువల్ల నిజము తెలిసినవారు నీకు దూరముగా వుంటున్నారు. అందుచేతనే ఘోరమైనది, భయంకరమైనది అయిన ఆపద కలిగినను, నీకు చెప్పేవారు లేరు. నీ యంతట నీవు తెలుసుకొనలేక పోవుచున్నావు.

***"సక్తం గ్రామ్యేషు భోగేషు కామవృత్తం మహీపతిమ్,***
***లుబ్ధం న బహుమన్యన్తే శ్మశానాగ్నిమివ ప్రజాః".***

'యింద్రియ గ్రామణి గ్రామే' అని కదా భగవద్గీత పాఠము. దాని ప్రకారము ఇంద్రియముల తృప్తికొరకు, ఇంద్రియములను తృప్తి పరిచేందుకు, భోగములను అనుభవిస్తూ, తద్వారా కామములను తీర్చుకుంటూ, స్వేచ్ఛగా ఇష్టము వచ్చే రీతిలో ప్రవర్తించే రాజు నీచుడు, బుద్ధిలేనివాడు. శ్మశానములో మండుచున్న అగ్ని వద్దకు జనులు ఎలా పోజాలరో, అలాగే ఇలాంటి బుద్ధిహీనుడైన రాజు వద్దకు ఎవ్వరునూ రారు, ఏమీ చెప్పరు, ఆపదలో చిక్కుకున్నప్పుడు ఎవ్వరూ సహాయము కూడా చెయ్యరు.

*"అయుక్తచారం దుర్ధర్మమస్వాధీనం నరాధిపమ్,*
*వర్జయన్తి నరా దూరాన్నదీపఙ్కమివ ద్విపాః"*

చేయరాని పనులు చేయుట, నిషిద్ధమైన నడవడి అనుసరించుట, ఎవ్వరినీ దరిదాపులకు రానీయకుండుట, మనసును స్వాధీనములో వుంచుకొనక పోవుట, ఇతరులకు, ఇతరుల మాటలకు లొంగిపోవుట, తద్వారా ఇంద్రియములకు వశమగుట, ఇంద్రియ సుఖములే పరమావధి అని తలచుట, అవి లేకపోతే బ్రతకలేమనుట, అలాంటి రాజును, రాజ్యపాలకుని ప్రజలు వదలివేస్తారు. వాని రాజ్యములో ప్రజలు వుండరు.

*"యే న రక్షన్తి విషయమస్వాధీనా నరాధిపాః,*
*తే న వృద్ధ్యా ప్రకాశన్తే గిరయః సాగరే యథాః".*

సముద్రములో వున్న కొండలు ఏ విధముగా వృద్ధి పొందవో, అలాగే తనను తాను అదుపులో పెట్టుకొనని, ఇంద్రియములను అదుపులో వుంచుకొనలేని రాజు కూడా వృద్ధి పొందలేదు. ఇక్కడ సముద్రములోని కొండలు అంటే భారమైన జలతత్త్వములోని భూతత్త్వము అని అర్థము. జలతత్త్వములో లయమైన భూతత్త్వము, జలతత్త్వము భారము యొక్క నియంత్రణలోనే వుంటుంది. అట్టి భూతత్త్వమునకు స్వేచ్ఛ లేదు. ఇక భారమైన జలతత్త్వము అంటే బుద్ధి. భూతత్త్వము అంటే చిత్తము. అంటే బుద్ధిలో లయమైన చిత్తము. విచక్షణ కోల్పోయిన చిత్తము. బుద్ధి ఆదేశానుసారముగా నడిచి, అహంకారము ద్వారా మనస్సును ప్రేరేపించుట. తద్వారా జరిగే కర్మాచరణ ఫలితము ద్వారా బుద్ధి మరింత భారమగుట.

*"ఆత్మవద్భిర్విగృహ్యా త్వం దేవగన్ధర్వదానవైః,*
*అయుక్తచారశ్చపలః కథం రాజా భవిష్యసి".*

నీవు బుద్ధిమంతులు, మంచివారైన దేవగంధర్వ దానవులతో విరోధము పెంచుకున్నావు. కానీ తగిన గూఢచారులను నియమించి వారు ఎప్పుడు, ఎక్కడ, ఎలా నీకు వ్యతిరేకముగా ప్రయత్నము చేయుచున్నారో తెలుసుకొనుట లేదు. కారణం వారందరు నీచే ఓడింపబడినవారే, కావున వారు నన్నేమీ చేయలేరని గర్వము, అహంకారములో వున్నావు. నీవు చపల చిత్తుడవు. మూఢుని వలే, బాలుని వలే ప్రవర్తిస్తున్నావు. నీ ఎదుట ముఖప్రీతి మాటలు మాట్లాడేవారిని నమ్మి, అదే నిజమని భ్రమపడి వాస్తవము తెలుసుకొనుట లేదు. వాస్తవము చెప్పేవారికి అవకాశము ఇవ్వటము లేదు. అలాంటి నీవు రాజుగా ఏల పనికొస్తావు?

దీనిని బట్టీ శత్రువుల కదలికలు ఎప్పటికప్పుడు గమనించాలి. అందుకు నమ్మకమైన గూఢచారులను నియమించాలి. వారికి వారి మనస్సులోని మాట చెప్పే స్వతంత్రమివ్వాలి. అలాగే

మనము చేయబోయే పనులు కూడ రహస్యముగా వుంచాలి.

ఇక్కడ శూర్పణఖ రావణని గుణములను చక్కగా అవగతము చేసుకున్నది. రావణునికున్న ప్రధాన గుణములు అమాయకత్వము, అహంకారము. అందుకే బాలుని వలే, మూర్ఖుని వలే అని సంబోధించినది, శూర్పణఖ.

*"త్వం తు బాలస్వభావశ్చ బుద్ధిహీనశ్చ రాక్షస,*
*జ్ఞాతవ్యం తు న జానీషే కథం రాజా భవిష్యసి".*

ఓ రాక్షసా! నీవు బాలుని వలే, బుద్ధిలేని వానివలే ప్రవర్తించుట ద్వారా తెలుసుకోవలసిన విషయములను తెలుసుకొనుట లేదు. దాయాదుల చావును కూడ తెలుసుకొనలేని స్థితిలో నీవున్నావు. అలాంటి నీవు రాజుగా పనికిరావు.

ఇక్కడ కూడ శూర్పణఖ అన్నగారైన రావణుని తత్వాన్ని చక్కగా అర్థము చేసుకున్నది. ఏమిటది? బాలుని వలే, బుద్ధిహీనుడి వలే, వేదవతి భస్మము అయిన తర్వాతి నుండి, రావణుడు కంటబడిన స్త్రీలందరినీ, పసిబాలుడు ఎలానైతే జుట్టు పీకుతాడో అలా జుట్టు పీకుతూ, తాను అన్వేషిస్తున్న కుండలిని శక్తి దొరకనట్లైతే, అహంకారియై బుద్ధిహీనుడై వారితో క్రీడించుట. ఆ విధముగానైనా తాను కోల్పోయిన కుండలిని శక్తి తిరిగి పొందగలడనే ఆశ. ఈ రెండు విభిన్న గుణములు, పసిబాలుని అమాయకత్వము మరియు వయసులో వున్న వాని అహంకారము గలవాడు రాజైతే అంతకు మించిన ప్రమాదకరమైన స్థితి, ఆ రాజ్యమునకు జరగదు గదా!

*"యేషాం చారశ్చ కోశశ్చ నయశ్చ జయతాం వర,*
*అస్వాధీనా నరేన్ద్రాణాం ప్రాకృతైస్తే జనైః సమాః".*

శత్రువులను జయించు వారిలో శ్రేష్టుడా! ఎవరైతే గూఢాచారులను, కోశాగార పాలనా వ్యవహారములను తన స్వాధీనము నందు వుంచుకొని, వాటిని జాగ్రత్తగా కాపాడుకొనునో అట్టి రాజు అభివృద్ధిని పొందుతాడు. అలా చేయలేని రాజు, రాజుగాదు. సామాన్య పౌరునితో సమానము. నీవు రాజుగా, రాజ్యపాలకునిగా వుండుటకు, కనీసము ఆ పేరుతో పిలవబడుటకు అర్హుడవు కావు.

*"యస్మాత్పశ్యన్తి దూరస్థాన్ సర్వానర్థాన్నరాధిపాః,*
*చారేణ తస్మాదుచ్యన్తే రాజానో దీర్ఘచక్షుషః".*

రాజులు ఎక్కడో దూరముగా జరిగే, జరుగబోయే పనులు చారుల ద్వారా తెలుసుకొందురు. తెలుసుకొనగలరు. అందుచేతనే వారు దీర్ఘదృష్టి, దూరదృష్టి కలవారు, దూరాలోచన గలవారు

అని కొనియాడబడతారు. నీకు అలాంటి గూఢచారులు, అలాంటి దూరదృష్టి లేకపోవుట వలన నీవేమీ తెలుసుకొనలేక పోతున్నావు. అందుచేతనే జన స్థానమున జరిగిన ఘోర కృత్యము నీకు తెలియదు. నీ చుట్టూ వున్న మంత్రులు కూడ మంత్రాంగము తెలిసినవారు కాదు. వారిలో మంత్రి కుండవలసిన లక్షణము ఒక్కటీ లేదు, సరికదా సామాన్యునికి వున్న లక్షణములు కూడా లేవు.

*"చతుర్దశ సహస్రాణి రక్షసాం క్రూరకర్మణామ్,*
*హతాన్యేకేన రామేణ ఖరశ్చ సహ ధూషణః".*

క్రూరులు, క్రూరమైన పనులు చేయువారైన పద్నాలుగు వేల రాక్షసుల సమానమైన ఖరధూషణాది రాక్షసులను రాముడొక్కడు పాదచారియై సంహరించినాడు. ఇక్కడ కుండలిని శక్తి అంశ దాగి వున్నది. రాముడు వాస్తవముగా చంపినది ఖర, ధూషణలు అను ఇద్దరినే. అయితే వీరిరువురి సప్తకుండలిని చక్రములో, అనగా పద్నాలుగు కుండలిని చక్రములలో, ఒక చక్రములో వేయి మంది రాక్షసుల క్రూర కర్మల రాక్షసశక్తి ఇమిడి వుండుటచే, మొత్తము పద్నాలుగు వేల క్రూర కర్మలు చేయు రాక్షసుల సంహారము ఎంత శ్రమతో కూడినదో, ఖరధూషణుల సంహారము కూడ అంతే కష్టతరము, అనే అద్భుత కుండలిని శక్తి అంశను తెలియ జేస్తున్నది. కావున రాముడు సంహరించినది ఖరధూషణాదులను ఇద్దరిని మాత్రమే. ఇంకా శూర్పణఖ రావణునితో

*"ఋషీణామభయం దత్తం కృతక్షేమాశ్చ దణ్డకాః,*
*దర్షితం చ జనస్థానం రామేణాక్లిష్టకర్మణా".*

కష్టసాధ్యమైన పనులు శ్రమ లేకుండా సాధించే రాముడు, అసాధ్యములను సుసాధ్యము చేయగల రాముడు, దండకలోని ఋషులకు అభయమిచ్చినాడు. 'యత్ర రామో భయము నాస్తి, నాస్తి తత్ర పరాభవ' అని కదా రాముని స్తోత్రము. దండకను క్షేమముగా, కష్టములను లేని ప్రాంతముగా చేసినాడు రాముడు. అంతేకాదు జనస్థానాన్ని వశము చేసుకున్నాడు. దశరథుని రాజ్యము దక్షిణ సముద్రము మధ్యభాగము వరకు వున్నది, కానీ రావణుడు దండక వరకు ఆక్రమించినాడు. హనుమంతుడు లంకకు వెళ్లే సమయములో సురసతో

*"తస్యాః సకాశం దూతోఽ హం గమిష్యే రామకారణాత్,*
*కర్తుమర్హసి రామస్య సాహ్యం విషయవాసిని."*

నేను రాముని ఆజ్ఞచే ఆతని దూతగా లంకలోని సీత వద్దకు వెళ్లుచున్నాను. నీవు రాముని రాజ్యములో నివసించుచున్నావు గావున రామకార్యమునకు, రామునికి సహాయము చేయవలెను. దండక వరకు ఆక్రమించిన రావణుని, దశరథుడు ఏమీ చేయలేక వూరుకున్నాడు.

*"దేవదానవగంధర్వా యక్షాః పతగపన్నగాః,*
*న శక్తా రావణం సోఢుం కిం పునర్మానవా యుధి".*

దేవ దానవ గంధర్వ యక్ష పక్షి పన్నగులకు కూడ యుద్ధము నందు రావణుని ఎదిరించుటకు శక్తి చాలదు. ఇక మానవుల మాట చెప్పవలెనా? అని దశరధుడు విశ్వామిత్రునికి చెబుతాడు. రాముడు ఖర ధూషణాదులను సంహరించిన తర్వాత రావణుడు ఆక్రమించిన రాజ్యమును తిరిగి పొందాడు.

*"త్వం తు లుబ్ధః ప్రమత్తశ్చ పరాధీనశ్చ రావణ,*
*విషయే స్వే సముత్పన్నం భయం యో నావబుధ్యసే."*

రావణా! నీవు దురాశాపరుడవు. మదించి వున్నావు. ఇతరుల ఆధీనములో వున్నావు. అందుకనే నీ దేశములో జరిగిన భయమును కలిగించే సంఘటనను కూడా తెలుసుకొనలేక పోతున్నావు. దురాశపరుడు అనగా తనకున్న దానితో తృప్తి చెందక, ఇతరుల రాజ్యమును, ఇతరుల భార్యలను అపహరించుట. దానికి మితము లేదు. ఇప్పటికే ఎంతో మంది దేవకన్యలను, యక్షకన్యలను, దానవకన్యలను, మానవకన్యలను, నాగకన్యలను చెరపట్టినావు. అయినా తృప్తి లేదు. నీ నగరము సముద్ర మధ్యములో వున్నది. అచ్చటికి ఎవ్వరునూ రాలేరు అని ధీమాగా, అజాగ్రత్తతో, మదముతో వున్నావు. నీ చుట్టూ వాళ్లు చెప్పేది విని నిజమని, ముఖః ప్రీతి మాటలు నమ్ముచున్నావు. రావణుడు తాను చెరపట్టిన స్త్రీలను గురించి 'బహీనా ముత్తమస్త్రీణా మాహృతానా మిత స్తతః' నేను అనేక దేశముల నుండి ఎందరో ఉత్తమ స్త్రీలను అపహరించి యున్నాను. అని స్వయముగా చెప్పిన మాట.

*"తీక్ష్ణ మల్పప్రదాతారం ప్రమత్తం గర్వితం శఠమ్,*
*వ్యసనే సర్వభూతాని నాభిధావన్తి పార్థివమ్"*

తీక్షణమైన స్వభావము గలవాడు, అల్పబుద్ధి గలవాడు, ఏమరిపాటున వుండేవాడు, అజాగ్రత్తగా వుండేవాడు, మూర్ఖుడు, వ్యసనములలో చిక్కిన రాజుకు, ఏ విధమైన కష్టము కల్గినను ఎవ్వరూ అతని వద్దకు వెళ్లరు. అతనికి సహాయము కూడా చేయరు. కాగా విరోధికి సహాయపడతారు.

పిపీలికాది బ్రహ్మ పర్యంతం అందరిని ఓడించి, పీడించి, వారి స్వాతంత్ర్యము, స్వేచ్ఛను హరించి, అందరిని తన ఆధీనములో, చెప్పుచేతలలో వుంచి, వారికి నిద్రాహారాలు లేకుండా, మనశ్శాంతి లేకుండా చేసాడు రావణుడు. రావణుని చర్య వలన ప్రకృతి సమతుల్యమును, సృష్టి సంకల్ప వికల్పములకు తీవ్ర అంతరాయము ఏర్పడినది. రావణుడు వశము చేసుకున్న వారంతా,

రావణునికి లొంగినట్లుగా కనపడ్డారు. రామలక్ష్మణులనే ఆధారము దొరకగానే, వారందరూ రావణుని చావు ద్వారా రామలక్ష్మణులకు సహాయపడినారు. అలాగే రావణుని అధీనములో వున్న అగ్ని, వాయువు కూడ హనుమంతుడనే ఆధారము దొరకగానే, విజృంభించి లంకను శ్మశానము చేసారు.

***"అతిమానినమగ్రాహ్యమాత్మసంభావితం నరమ్,***
***క్రోధినం వ్యసనే హన్తి స్వజనోఽపి మహీపతిమ్".***

అధికముగా గర్వము గలవాడు, దగ్గరకు వెళ్లుటకు శక్యము కానివాడు, భయపెట్టే స్వభావము గలవాడు, తనకు నచ్చిన అనుకూలమైన మాటలు, ముఖః ప్రీతి మాటలు వినేవాడు, అలాంటి వారిని మాత్రమే దగ్గరకు రానిచ్చేవాడు, కోప స్వభావము గలవాడు, మంచి చెప్పేవానిని కసురుకుని, చీదరించి దగ్గరకు రానివ్వక దూరముగా వుంచేవాడు, అటువంటి రాజును, అదను చూసుకుని, ఆపద సమయములో, తనవారే తన వారనుకున్న వారే చంపుదురు. పైన ప్రస్తావించిన గుణములు గల రాజు, రాజ్యపాలకుడు, రాజ్యమును, అధికారమును పోగొట్టు కొనును. అధికారము కోల్పోయిన వానిని ఎవ్వరు చూడరు, పిల్వరు, ముఖము తప్పిస్తారు. ఇంత చెప్పిన శూర్పణఖ ఇంక – అభివృద్ధి కలిగే లక్షణములు, రాజుకు వుండవలసిన లక్షణములను చెప్పటము మొదలు పెట్టింది. ఇంతవరకు చెప్పిన గుణములు రావణునిలో వున్నవి, రామునిలో లేనివి. ఇక ముందు చెప్పబోయే గుణములు రావణునిలో లేనివి, రామునిలో వున్నవి.

***"అప్రమత్తశ్చ యో రాజా సర్వజ్ఞో విజితేన్ద్రియః,***
***కృతజ్ఞో ధర్మశీలశ్చ స రాజా తిష్ఠతే చిరమ్".***

ఏ రాజు ఏమరిపాటులేక, జాగృత్తతోటి, తెలుసుకొనవలసిన విషయములను తెలుసుకొనుచు, వాటికి తగిన నిర్ణయములను తీసుకుంటూ, ఇంద్రియములను వశములో వుంచుకొని, ఎవరైనా ఏ కొంచెమైన మేలు చేస్తే, ఆ మేలు మరచిపోకుండా, వారితో మైత్రి కొనసాగిస్తూ, ఆ విధముగా మిత్రులను సంపాదించి, ధర్మమార్గములో నడుచుకుంటాడో, అట్టి రాజు చిరకాలము, చాలాకాలము రాజుగా వుండగలడు. రాజుగా వుండుటకు అర్హుడు. ఇట్టి గుణములు నీకు లేవు. నీవు శత్రువులను సంపాదించావు కానీ, మిత్రులను సంపాదించుకొనలేదు. ధర్మమార్గమున నడుచుట లేదు. పైగా అన్ని అధర్మాలే చేస్తున్నావు. ఇంద్రియ నిగ్రహణముందా అంటే అది కూడా లేదు. అందువలన నీవు అచిరకాలములో నీ రాజ్యాన్ని కోల్పోతావు. నీవు ఎక్కువ కాలము జీవించివుండవు.

***"నయనాభ్యాం ప్రసుప్తోఽపి జాగర్తి నయచక్షుషా,***
***వ్యక్తక్రోధప్రసాదశ్చ స రాజా పూజ్యతే జనైః".***

ఏ రాజు కళ్లు మూసుకొని నిద్రిస్తున్నా, నీతి జ్ఞానమనే నేత్రములతో మేలుకొని వుంటాడో, క్రోధమును విడిచి, ఏమరుపాటు లేకుండా వుంటాడో, అతనిని జనులు పూజింతురు.

ఇక్కడ శూర్పణఖ ఒక అద్భుత రహస్యాంశమును ఆవిష్కరించినది. నిద్రిస్తున్నా, జ్ఞాననేత్రమును తెరిచి జనులచే పూజింపబడే రాజు ఎవరు? ఆయనే యోగనిద్రలోని శ్రీ మహావిష్ణువు. ఇక్కడ శూర్పణఖ, రాముడు విష్ణ్వాంశ సంభూతుడని, ఆయనకు వశమగుటచే తనలో జ్ఞానోదయము అయినట్లు స్పష్టముగా తెలుపుచున్నది. అంతేకాదు, రావణుని కూడా, రామునికి వశమై జ్ఞానోదయము పొందమని సూచిస్తున్నది.

*"త్వం తు రావణ దుర్బుద్ధిర్గుణైరేతైర్వివర్జితః,*
*యస్య తేఽ విదితశ్చారై రక్షసాం సుమహాన్వధః".*

రావణా! దుర్బుద్ధివైన నీలో ఈ గుణములు లేవు. రాక్షసవధ గురించిన విషయము కూడా నీ గూఢచారులకు తెలియదు. వారు తెలుసుకొనుటకు ప్రయత్నము కూడా చేయలేదు. వారికి తెలిసియుండిన, వారు నీకు ఈ సమాచారమును తెలిపి యుండెడివారు కదా!

*"పరావమన్తా విషయేషు సంగతో*
*న దేశకాలప్రవిభాగతత్త్వవిత్,*
*అయుక్తబుద్ధిర్గుణదోషనిశ్చయే*
*విపన్నరాజ్యో నచిరాద్విపత్స్యసే".*

నీవు పరులను అవమానించుచూ, భోగము లందు ఆసక్తి కలిగి, ఏ దేశములో ఏ పని, ఏ సమయములో చేయవలెనో, ఆ పని యొక్క మంచి చెడులను, లాభ నష్టములను నిర్ణయించలేని బుద్ధితో వున్నావు. అంటే రావణుని చిత్తము, బుద్ధిలో లయమై విచక్షణ కోల్పోయినది. అట్టి నీవు, నీ రాజ్యము తొందరలోనే నశించెదరు. ఆపద కూడా శీఘ్రముగా సంభవిస్తుంది. ఈ విధముగా శూర్పణఖ రావణునికి జ్ఞానబోధ చేసినది. ఇక్కడ తనకు జరిగిన జ్ఞానోదయము రావణునికి జరగవలెనని, అందుకే రావణుని ఎలాగైన రాముని వశము అవమని తొందరపెట్టినట్లు స్పష్టముగా తెలుస్తున్నది. ఇది జ్ఞానోదయము అయిన వారి ప్రభావము. జ్ఞానోదయము కల్గిన వారికి సర్వమూ బోధపడతాయి. మంచి చెడు అన్ని విషయములు అవగతమవుతాయి. కాబట్టే అందరూ ఈ స్థితికి చేరుకోవాలని కోరుకోవటము వారి లక్షణము అవుతుంది.

ఇలా ఇరవైమూడు శ్లోకములలో శూర్పణఖ రావణునికి నీతి సూత్రములను బోధించినది. గురుస్థానమునకు యోగ్యత కలవారే అంతగా విశదీకరించి, వివరించే సామర్థ్యము కల్గినవారు అగుదురు. గురువు అనగా ఎవరు? జ్ఞానోదయము కలిగి దిశ చూపకలిగినవాడే గురువు. ఎవ్వరి

మాటలని లెఖ్ఖచేయని రావణుడు శూర్పణఖ మాటలను ఎందుకు అంత శ్రద్ధగా వినగలిగాడు? విభీషణుడు అంత నీతి బోధించినగానీ, ఆతనిని రాజ్యసభ నుండి బహిష్కరించాడు. 23 నిండితే తర్వాతి సంఖ్య 24, అవే గాయత్రిలోని 24 బీజములు. 4×3×2×1=24 జ్ఞానేంద్రియములైన బుద్ధి, చిత్తము, అహంకారము, మనస్సు వివిధ క్రమములు ఇరవై నాలుగు. అనగా రావణుని జ్ఞానేంద్రియములకు వివిధ రకములైన శిక్షణ కల్పించినది, శూర్పణఖ.

ఇన్ని విషయములను వల్లెవేసిన శూర్పణఖ చెప్పినదంతా విన్న రావణుడు, దీర్ఘముగా ఆలోచించి శూర్పణఖతో, ఆ రాముడెవరు? అతని బలమెట్టిది? అస్త్ర సంపద ఎట్టిది? ఆతడు దండకలో ఎందుకు ప్రవేశించాడు? నాకు వివరముగా చెప్పమని అడుగుతాడు. కాబట్టీ రావణుడు శూర్పణఖకు వశమైనాడు అని తెలుస్తున్నది.

***"ఆయుధం కిం చ రామస్య నిహతా యేన రాక్షసాః,***
***ఖరశ్చ నిహతః సంఖ్యే ధూషణస్త్రిశిరాస్తథా".***

యుద్ధములో ఖరుని, ధూషణుని, త్రిశరుని చంపిన ఆయుధ మేమిటి? ఏ ఆయుధముతో రాముడు వారిని చంపినాడు? అనగా పద్నాలుగు వేల మంది క్రూర కృత్యములు చేయగల రాక్షసులతో సమానమైన వారైన ఖరధూషణాదుల సంహారమునకు ఏదో కొత్త శక్తిమంతమయిన ఆయుధము ఉపయోగించి వుండవచ్చునని లేక తాను వెతుకుతున్న కుండలిని శక్తి రాముని వద్దకు చేరినదేమోనని రావణుడు తలచినాడు. అందుకే ఏ ఆయుధము వుపయోగించెనని ఆశక్తితో ప్రశ్నిస్తాడు. అంతట శూర్పణఖ సమాధానముగా

***"దీర్ఘబాహుర్విశాలాక్షశ్చీరకృష్ణాజినామ్బరః,***
***కన్దర్పసమరూపశ్చ రామో దశరథాత్మజః".***

అజానుబాహుడు అనగా మోకాళ్ల వరకు వ్యాపించిన చేతులు గలవాడు, మోకాళ్ల వరకు చేతులుంటే ఏమి జరుగుతుంది? చేతులు ఎంత పొడుగుగా వుండునో, చేతివేళ్ల నుండి ప్రసరణమయ్యే కుండలిని శక్తి అంత వేగవంతమవుతుంది. దీనివలన వింటినారి సంధించి విడిచిన బాణము అత్యంత వేగవంతమై, విరోధికి గాఢముగా తగులుతుంది. రాముని అస్త్రలాఘవము గురించి రావణుడు తెలుసుకోవాలని శూర్పణఖ భావన. విశాలాక్షి అనగా వెడల్పయిన కన్నులు గలవాడు, ఈ కన్నుల అందము, పొందిక చేతనే శూర్పణక మోహము చెందినది. రాముని విశాలక్ష గుణమును గురించి, రాముని గుణముల శీర్షికలో విస్తారముగా చర్చించటమైనది. ఖరునితో పౌండరీక విశాలక్షౌ అని చెప్పిన శూర్పణఖ, ఖరుని మరణానంతరము జ్ఞానోదయము కలిగి రావణునితో విశాలాక్ష అని వర్ణించినది. అటు తర్వాత నార చీరలు ధరించినవారై,

మన్మధునితో సమానమైన రూపము గలవాడైన దశరధుని పుత్రుడైన రాముడు అని పరిచయము గావిస్తుంది. ఒక కవి రాముని గురించి 'కందర్ప శతకోటి సుందర' అంటే మన్మధుని రూపము కంటే వందకోట్లు అధికముగా మోహించు రూపము కలవాడని అర్థము.

అయితే ఇక్కడ రావణుడు రాముని ఆయుధము గురించి వివరణ అడిగితే, శూర్పణఖ రాముని అందము, శరీర సౌష్టవము గురించి వివరించినది. అంటే ఇంకా శూర్పణఖ రాముని రూపమును మనసులో ధ్యానిస్తున్నది, మనస్సులో నిలిపినది. ఇంకనూ రాముని మరువలేదు. అందుకే ఇంత గొప్పగా వర్ణించినది. అనగా శూర్పణఖ మోహభ్రాంతితో కూడిన జ్ఞానోదయము పొందినది.

*"శక్రచాపనిభం చాపం వికృష్య కనకాఙ్గదమ్,*
*దీప్తాన్ క్షిపతి నారాచాన్ సర్పానివ మహావిషాన్".*

రాముని ధనుస్సు ఇంద్రధనుస్సు వంటిది. అనగా ఇంద్రధనుస్సులో ఏడు రంగులు పొంది వున్నట్లు, రాముని ధనుస్సులో సప్తకుండలిని చక్రముల నుండి వెలువడే కుండలిని శక్తి దాగియున్నది. ఇది ఎలా సాధ్యము? సప్తకుండలిని శక్తి ప్రసరణ, చేతివేళ్ల ద్వారా వెలువడి, ఆ చేతివేళ్లు వింటినారిని, ధనుస్సును సృజించుట ద్వారా, ధనుస్సు నుండి సంధింపబడే బాణములో ప్రవేశించును. రాముడు తన ధనుస్సు నుండి విషపూరితమైన సర్పముల వంటి బాణములను ప్రయోగించును. పంచభూతములు ఒక యోగ స్థితిలో చేరితే వర్షము కురుస్తుంది. వర్షమునకు పూర్వము ఇంద్రధనుస్సు ఏర్పడుతుంది. వర్షము వలన చల్లదనము, ఇంద్రధనుస్సు చూచినపుడు ఆహ్లాదము కల్గుతుంది. ఇక్కడ రాముని ధనుస్సు నుండి వెలువడిన బాణములు, లోకకంటకులైన రాక్షసులను చంపి, లోకాలకు మేలు, శాంతి, సౌఖ్యము సుస్థిరపరుచునని అర్థముతో శూర్పణఖ చెప్పి వుండవచ్చును. రావణునికి రాముని కుండలిని శక్తి మహిమ ఎరుక గల్గుటకు ఇంద్రధనుస్సు గురించి చెప్పినది శూర్పణఖ.

*"నాదదానాం శరాన్ఘోరాన్న ముఞ్చన్తం శిలీముఖాన్,*
*న కార్ముకం వికర్షన్తం రామం పశ్యామి సంయుగే".*

రాముడు భయంకరమైన బాణములను అంబుల పొది నుండి ఎప్పుడు బయటకు తీస్తాడో, ఎప్పుడు వింటినారికి తొడుగుతాడో, ఎప్పుడు ఆ బాణములను సంధిస్తాడో ఎవరికి అంతుచిక్కదు. కంటి చూపుకు అందదు. కంటి చూపుకు అందనంత వేగవంతముగా ఈ మూడు కృత్యములు వేగవంతముగా జరుగుతాయి. కాంతి కిరణముల వేగముతో బాణములను సంధించగలవాడు

రాముడు. ఇంతటి వేగమునకు కారణము రాముని కుండలిని శక్తి మాత్రమే.

***"ఎత్తిన ఆయుధములవి యెన్నియో నన్నటి నన్నితూపు***
***లన్ యత్తునియలగుజేయు మరితోడనెపూనగ***
***చేతుల నాడ నీడ త్తరుణీరధాశ్వముల కండరాన్విడం***
***ప తున్కయే మనవచ్చు నాతని శరలాఘవ సావధానతల్"***

విజయ విలాసము నుండి, చేమకూరి వెంకటకవి గారు.

***"హన్యమానం తు తత్సైన్యం పశ్యామి శరవృష్టిభిః,***
***ఇన్ద్రేణేవోత్తమం సస్యమాహతం త్వశ్మవృష్టిభిః".***

ఇంద్రుడు రాళ్ల వాన కురిపించినపుడు పైరు నాశనమైనట్లు, రాముని బాణముల వల్ల సైన్యము చచ్చుటయే కనపడుతుంది. సైన్యము చచ్చిన దానిని బట్టి రాముడు బాణములను ప్రయోగించాడు అని తెలుసుకుంటాము. అంతేకాని మరొక విధముగా మనకు కనపడదు.

***"రక్షసాం భీమరూపాణాం సహస్రాణి చతుర్దశ,***
***నిహతాని శరై స్తీక్ష్ణైస్తేనైకేన పదాతినా.***
***అర్ధాధికముహూర్తేన ఖరశ్చ సహధూషణః".***

భయంకరమైన పద్నాలుగు వేల రాక్షసుల సమానము, రూపము గల ఖర ధూషణాదులను రధము, అశ్వములు, సారధి ఇవేమీ లేకుండా, నేలపై నిలచి, పాదచారియై, తన తీక్షణమైన బాణములతో ఒకటిన్నర ముహూర్త కాలవ్యవధి అనగా ఒక గంట పన్నెండు నిమిషములలో చంపినాడు.

అయితే ఇక్కడ ఈ ఒకటిన్నర ముహూర్త కాలవ్యవధి ఒక గంట పన్నెండు నిమిషములు, ఈనాటి కాల ప్రమాణమును బట్టీ వేసిన అంచన. త్రేతాయుగములో, భూగోళము పూర్తిగా పరిణితి చెందలేదు. అక్కడక్కడ స్వల్ప మోతాదులలో భూతత్వము వ్యక్తమైనది. అధికముగా భరతఖండములోని భూమి మాత్రమే బహిర్గతమైనది. ఇంచుమించు తక్కిన ప్రాంతములన్నీ జలమయమయినాయి, చీకటిలో వున్నాయి. కాబట్టీ ఆ కాలములో భూగోళము ఇప్పటి కంటే భారవంతమైనది అని చెప్పవచ్చును. అలాగే సూర్యచంద్రులు పూర్ణాకృతిలో లేకుండా పరిభ్రమణము గావించారు. కాబట్టీ ఒకటిన్నర ముహూర్త కాల వ్యవధి ఇప్పటి అంచన కంటే ఎక్కువగనే వుండవచ్చును.

***"భ్రాతా చాస్య మహాతేజా గుణవాంస్తుల్యవిక్రమః,***
***అసురక్తశ్చ భక్తశ్చ లక్ష్మణో నామ వీర్యవాన్".***

మహాతేజ సంపన్నుడు, అన్న యందు ప్రేమగలవాడు, భక్తి గలవాడు, గుణములలోను, విక్రమములోను అన్నతో సాటిగలవాడు, అన్నతో సమానమైన వాడు, అన్నకు తీసిపోనివాడు లక్ష్మణుడనే సోదరుడున్నాడు. ఆ సోదరుడు అవసర సమయములో క్రోధమును కనపరచగలడు, అపజయము నెరుగనివాడు, అన్న కొరకు ప్రాణములైన ఇవ్వగల్గినవాడు, లక్ష్మణుడు.

ఇంత చెప్పిన తర్వాత తన అన్నయైన రావణుడు శంకించి సందేహించి, నీవు వారి వద్దకు ఎందుకు వెళ్లినావు? వారిని గురించి, వారి రూపము గురించి, అందము గురించి, వారి ప్రతాపము, వీర్యము, బాణ ప్రయోగము, లక్ష్యలాఘవ శుద్ధిని గురించి ఇంతగా పొగుడుటలో నీ ఉద్దేశ్యమేమిటి? అని ప్రశ్నిస్తాడని ఆలోచించి, రావణుని నుంచి అలాంటి ప్రశ్న రాకుండా వుండేందుకు శూర్పణఖ ఇలా చెబుతుంది.

***"రామస్య తు విశాలాక్షీ పూర్ణేన్దుసదృశాననా,***
***ధర్మపత్నీ ప్రియా భర్తుర్నిత్యం ప్రియహితే రతా".***

రాముని భార్య, విశాలమైన నేత్రములు గలది, పూర్ణచంద్రునితో సమానమైన ముఖము గలది, భర్తకు చాలా ఇష్టమైనది, ఎల్లప్పుడు భర్త యొక్క మేలు, కీర్తి, అభివృద్ధి కోరేది.

***"సా సుకేశీ సునాసోరుః సురూపా చ యశస్వినీ,***
***దేవతేవ వనస్యాస్య రాజతే శ్రీరివాపరా".***

అందమైన మెత్తని, నల్లని కేశములు గలది, అందమైన బలిసిన తొడలు గలది, రూప సౌందర్యములో దేవతా స్త్రీలను మించినది, కీర్తివంతురాలైన సీత వనము మధ్యలో వనదేవత వలే, రెండవ లక్ష్మివలే ప్రకాశించుచున్నది.

ఈ శ్లోకములో శూర్పణఖ సీత మెత్తని జుట్టు ప్రస్తావన చేయుట ద్వారా రావణుని లోని పసిబాలకుని లక్షణము అయిన జుట్టు పట్టుకులాగే గుణమును, ఆతనికి జ్ఞప్తికి కలిగిస్తున్నది. అలాగే సీత రూప సౌందర్యము వర్ణించుట ద్వారా ఒకవేళ కేశములలో కుండలిని శక్తి లభించని యెడల, అహంకార మదముతో క్రీడించవచ్చుననే భావన రావణునిలో కల్గిస్తున్నది. వనదేవత, రెండవ లక్ష్మి అనుట ద్వారా సీతలోని వనదుర్గ అంశను, భూదేవి అంశను తెలియజేస్తున్నది. ఆది వరాహలక్ష్మి భూదేవి అయితే, ఆమె నుండి వ్యక్తమైన సీత రెండవలక్ష్మి అయినది.

***"తప్తకాఞ్చనవర్ణాభా రక్తతుఙ్గనఖీ శుభా,***
***సీతా నామ వరారోహా వైదేహీ తనుమధ్యమా".***

ఆమె శరీరము శుద్ధమైన, పుటము పెట్టిన బంగారము వలె నిగనిగలాడు చుండును. మంగళప్రదురాలైన ఆమె గోళ్లు ఎర్రగాను, ఎత్తుగాను వుండును. నడుము సన్నగా వుండును.

ఆమె విదేహ రాజైన జనకుని కుమార్తె. ఆమె పేరు సీత. ఈ శ్లోకములోని రహస్యాంశము చూద్దాము. స్వాధిష్ఠాన చక్రములోని పండునారింజ రంగు మరియు మూలాధారములోని లేత అరుణ కాంతి వర్ణము కలిస్తే ఉద్భవించే రంగు బంగారు వర్ణము. కాబట్టీ సీతలో స్వాధిష్ఠాన, మూలాధార చక్రముల ప్రభావము ఉధృతముగా వున్నది. దీనికి కారణము ఆమెలో దాగి వున్న సృష్టిపోషణకు అవసరమైన ఐదు వందల సంవత్సరముల కుండలిని శక్తి నిధి. ఈ కాలములో కూడా స్వాధిష్ఠాన చక్రము జాగృతమైన వారి ముఖము బంగారు ఛాయతో ప్రకాశిస్తుంది. సీతలోని గుప్తమైన కుండలిని శక్తి నిధి గురించి శూర్పణఖ పరోక్షముగా వర్ణించినది. అంత గొప్పదైన కుండలిని శక్తిని ధరించుటచే, దాని ప్రభావము వలన బంగారము వలే నిగనిగలాడే మేను, ఎర్రనైన గోళ్లు కలవిగా ఉన్నది సీత.

***"యస్య సీతా భవేద్భార్యా యం చ హృష్టా పరిష్వజేత్,***
***అతిజీవేత్స సర్వేషు లోకేష్వపి పురన్దరాత్".***

ఆ సీతను భార్యగా పొందగలిగినవాడు, ఆ సీత ఎవరిని ఇష్టపూర్వకముగా, ఆనందముగా, సంతోషముగా కౌగిలించుకొనునో, అతడు అన్ని లోకములలో దేవేంద్రుని కంటే గొప్పవాడు. అలాంటి సీత నీకు భార్య, ఆమెకు భర్తగా నీవు తగినవాడవు. సీత కౌగిలించుకుంటే ఏమి జరుగుతుంది? సీతలోని కుండలిని శక్తి  భాండాగారము నుండి కుండలిని శక్తి ప్రవహించి, కౌగిలించుకున్న వ్యక్తిలో చేరుతుంది. అందుచే దేవేంద్రుని కంటే గొప్పవాడని చెప్పినది.

రావణుని తత్వము తెలిసిన శూర్పణఖ, తనవలె వెళ్లి రామునికి వశపడమని చెబితే వప్పదని గ్రహించి, సీతను వర్ణించి సీతకు వశమవమని ప్రేరేపించే లక్షణము. కారణం సీత రాముని వశమైనది కావున, సీతకు వశమైన రావణుడు అంతర్లీన ప్రక్రియ ద్వారా అనగా అపరవిద్య ద్వారా రామునికి వశమవుతాడని అనుకున్నది.

***"తాం తు విస్తీర్ణజఘనాం పీనశ్రోణిపయోధరామ్,***
***భార్యార్థే తు తవానేతుముద్యతాహం వరాననామ్,***
***విరూపితాస్మి క్రూరేణ లక్ష్మణేన మహాభుజ".***

గొప్ప భుజములు గలవాడా! విశాలమైన, వెడల్పయిన నడుము గలది, బలిసిన కటి ప్రదేశము కలది, బలిసిన చన్నులు కలది, సుందరమైన ముఖము గలది అయిన సీతను నీకు భార్యగా తీసుకు రావటానికి అక్కడికి వెళ్లగా, క్రూరుడైన లక్ష్మణుడు నన్ను ఈ విధముగా విరూపిని, కురూపిని చేసినాడు.

ఇది ఒక చర్చనీయాంశము. జ్ఞానోదయమైన శూర్పణఖ ఇంతవరకు వున్నవి వున్నట్లుగా నిజములు చెప్పి, ఇక్కడ మాత్రము అబద్ధము చెప్పినది. ఏమని? సీతను నీకు భార్యగా తీసుకు రావటానికి వెళ్లానని చెప్పినది. ఈ భావన వెనుక దాగి వున్న విశ్లేషణ ఏమిటో చూద్దాము.

1) ఇంతకు పూర్వము సీత అందాన్ని, చక్కదనాన్ని చెప్పి, చెప్పిందే చెప్పి రావణునిలో కామవాంఛ రేకెత్తించినది.

2) తర్వాత రావణ సుఖము కోరి, సీతను భార్యగా తీసుకు రావటానికి వెళ్లి పరాభవము పొందినాను అని చెప్పటము ద్వారా రావణునిలో ప్రతీకార జ్వాల రేపినది.

3) రామలక్ష్మణుల ప్రతాపము గురించి చెప్పటము ద్వారా, రావణునిలో వారిని ఎదిరించుట అసాధ్యమేమో అనే ఆలోచన కలిగించినది.

ఇలా అబద్ధము చెప్పి ఇదంతా శూర్పణఖ ఎందుకు చేసినది? శూర్పణఖకు జ్ఞానోదయము అవలేదా? జ్ఞానోదయము అయినవారు అసత్యము పలుకవచ్చునా? రాముని రూపము, సౌందర్యముకు వశమైన శూర్పణఖకు తప్పక జ్ఞానోదయము కల్గినది. అయితే జ్ఞానోదయము అయినదేగాని జ్ఞానము పూర్ణవంతముగా వికసించలేదు. దక్షిణాచారమునకు, వామాచారమునకు అతీతమైన సాక్షీభూతస్థితి సమయాచారము. వామాచారములో ఉన్న శూర్పణఖ, ఆ వామాచారములో పండి పరిపక్వత పొందితేనే సమయాచార స్థితికి చేరుకోగలదు. జ్ఞానోదయము కల్గిన శూర్మణఖ వామాచార పరిపక్వము చెందే దశ ఆరంభమైనది. ఉదయించే సూర్యుని తీవ్రత వేరు, మధ్యాహ్న భానుని తళతళ ప్రకాశము వేరుకదా. రాముని దర్శనముతో శూర్పణఖకు జ్ఞానోదయము చిగురించినది. కనుకనే ఎవ్వరినీ, ఎవ్వరి మాటలను లెఖ్ఖ చేయని రావణుడు, శూర్పణఖ ఇంత ఉపోద్ఘాతము శ్రద్ధగా ఆలకించాడు. జ్ఞానోదయము అయిన వారి మాటలు అందరు వినవలసినదే, ఆచరించ వలసినదే. వారి మాటలలో దక్షిణామూర్తి తత్వము ఇమిడి వుంటుంది. మరి శూర్పణఖ అబద్ధము ఎందుకు చెప్పినట్లు?

జ్ఞానోదయము కల్గినా పూర్ణ వికాసము కలగకపోవటము ఒక కారణమైతే, ఒక బృహత్తర ప్రయోజనము కొరకు అసత్యము ఆడుట తప్పు లేదనుకున్నది. ఇది రెండవ కారణము. ఇక మూడవ కారణము, తనలోని శేషముగా వున్న వామాచార వాసనలను అబద్ధము పలకటము ద్వారా పరిత్యజించి, వామాచారములో పండి పరిపక్వత చెందినది. ఈ బృహత్తర ప్రయోజనము ఏమిటో చూద్దాము. తనకు వలెనే రావణుడు కూడా రామునికి వశమై జ్ఞానోదయము పొందాలనుకున్నది. మహాభారత యుద్ధములో కూడా పూర్ణజ్ఞానోదయ సంపన్నుడైన కృష్ణుడు ధర్మరాజుకు అసత్యము పలకమని ప్రోత్సహించాడు కదా! ఇక నాల్గవ కారణము, శూర్పణఖ రావణుని కారణముగనే వైధవ్యము పొందినది. శూర్పణఖ భర్తను రావణుడే చంపాడు. కావున

రావణుడు కూడ తన వలెనే నాశనము అవవలెననే సంకల్పము ఎంతో కొంత వుండి వుండవచ్చును. ఈ నాల్గు కారణముల సారము, శూర్పణఖ చేత అసత్యము పల్కించినది.

***"కృతాస్మి విధవా రాజం స్త్వయా బలవతా బలాత్,***
***ఏతే రాజం స్త్వయా వీర్యా ద్దైత్యా విని హితారిణే,***
***కాలకేయ ఇతిఖ్యాతాః' సహస్రాణి చతుర్దశం."***

కాలకేయులను దైత్యులను పద్నాలుగు వేల మందిని నీవు చంపినావు. ఈ పద్నాలుగు సంఖ్య విశిష్టత రామాయణములో చాలామార్లు చెప్పుకున్నాము.

***"ప్రాణేఽ బోపి గరీయాన్మే తత్రభర్తా మహాబలాః,***
***సోఽ పి త్వయా హతస్తాతరిపుణా భాతృగందినాః."***

నాయనా! నా ప్రాణము కంటే ప్రియుడైన, బలవంతుడైన నా భర్త మరణించిన వారిలో వున్నాడు. సోదరుడను పేరుతో నాకు శత్రువై వైధవ్యము కల్పించావు. దీనినిబట్టీ శూర్పణఖకు సంసారసుఖము లేకుండా చేసినవాడు రావణుడు. పోనీ అంతకంటే అందగాళ్ళు, రామలక్ష్మణులు దొరికారు, ఎలానో ఆ సుఖము పొందుదామంటే, అది చెడిపోవడమేగాక, రూపము కూడా చెడిపోయినది. కాబట్టీ ఇప్పుడు శూర్పణఖ ఏమిటి చెయ్యాలి?

1) తన సంసార సుఖము పాడుచేసిన వానికి సంసార సుఖము లేకుండా, దక్కకుండా చేయాలి.

2) తనను కురూపిగా చేసిన రామలక్ష్మణులను, వారిపై కచ్చ తీర్చుకోవాలి.

3) తన కామవాంఛకు అడ్డముగా నిల్చిన సీతను కష్టాలపాలు చేయాలి.

4) తాను వామాచారములో వుండగా జ్ఞానోదయము కల్గి, వామాచారములో పండి పరిపక్వము పొందినట్లుగా రావణుడు కూడా వామాచారములో పరిపక్వత చెందవలెను.

5) తన భర్త శత్రువుల చేతిలో బలవంతపు చావు చచ్చినట్లుగా తన భర్త చావు కారణమైన రావణుడు కూడా అలాగే శత్రువు చేతిలో బలవంతపు చావు చావాలి. ఈ ఐదు కోర్కెలు తీరవలెనంటే ఏమి చేయాలి?

తన అన్నను ప్రేరేపించి, దొంగతనముగా సీతను తీసుకువస్తే, సీత లంకలో కష్టాలకు గురౌతుంది. వీరాధి వీరులు, శూరులు అయిన రామలక్ష్మణులు తీవ్ర మనస్తాపానికి గురి అవుతారు. వారు ఈ పాడు పనిని ఉపేక్షించరు. ఏదో విధముగా రావణుని అంతము చూస్తారు. అప్పుడు రావణునికి సంసార సుఖము లేకుండా పోతుంది, కష్టము అంటే ఏమిటో తెలుస్తుంది. ఇవన్నీ ఒక ఎత్తు అయితే, తన వలెనే రావణునికి రాముడు దర్శనము జరిగి జ్ఞానోదయమై, రాజ్యపాలన

చక్కగా నిర్వహిస్తాడనే సత్సంకల్పము కూడా వుండి వుండవచ్చును.

ఈ విధముగా ఆలోచించి పథకము తయారుచేసింది. రామలక్ష్మణులు అడవికి రావటానికి మూలము మంథర. అలానే రావణుడు పతనానికి కారణము శూర్పణఖ. రామాయణములో వీరిరువురు వారి కార్య నిర్వహణ తర్వాత ఎక్కడా కనపడరు.

ఇంతటి ప్రాముఖ్యత గల శూర్పణఖ పాత్రలోని రహస్యాంశములు, విశేష గుణములు, ఈ పాత్ర లక్ష్యము, శూర్పణఖను ఏ విధముగా ప్రసన్నము చేసుకొన వచ్చును, దానివలన కలిగే ప్రయోజనములు క్లుప్తముగా చూద్దాము.

కైకసి, విశ్రవసుల నాల్గవ సంతానము శూర్పణఖ. సంతాన వాంఛతో విశ్రవసును ఆశ్రయించిన కైకసితో సాక్షీభూతుని వలే క్రీడించిన విశ్రవసు, మొదటి రెండు సంతానముల తర్వాత, సాక్షీభూతుడైనను తాను కొంత ప్రమేయ పూర్వకముగా క్రీడించుట వలన, శూర్పణఖ రూపములో మూడవ సంతానము కలిగినది. రామాయణములో శూర్పణఖ పాత్ర తక్కువ కాలములో ఎక్కువ ఫలితము నిచ్చినది. నవరసములలో ఏ రసము మితిమీరి, అదుపు తప్పినా, అది చివరకు భక్తి రసములో కలుస్తుంది, అని శూర్పణఖ నిరూపించినది. దక్షిణము, అనగా మూలాధారము నుండి ఉత్తరము, అనగా సహస్రారము ప్రయాణించి, రాముని మోహించి అతనికి వశమైనది. వామాచారములో ఉన్న శూర్పణఖ రాముని దర్శనము ద్వారా వామాచారము అంతమైనది. రాముని, నీవు నేను వేరు కాదు అనే అపరతత్వముతో మోహించిన శూర్పణఖ, ఆ మోహములోనే విరక్తి చెంది, ఎలానైతే తేనెను ఆస్వాదించే చీమలు ఆ తేనెలోనే పడి ప్రాణములను విడిచి ముక్తి పొందుతాయో, ఏ రూపముకై మోహము చెందినదో, ఆ సాధనములోనే పండి, కురూపియై, విరూపియై జ్ఞానోదయమును పొందినది. నదులన్నీ చివరకు సంగమించవలసినది సముద్రములోనే అన్నట్లుగా, అన్ని రసములు పండిన తర్వాత చివరకు భక్తి రసములోనే కలవలెనని శూర్పణఖ నిరూపించినది. ఈ ప్రతిపాదనకు మరొక ఉదాహరణ అన్నమాచార్యులు. శృంగార రసమును ఎంచుకొని, ఆ రసములోనే పండి, దానినే భక్తిరసముగా మరల్చి తరించినాడు, అన్నమయ్య. శూర్పణఖకు కలిగిన జ్ఞానోదయముచే రాముని సౌందర్యమును, రూపమును అతి మధురముగా వర్ణించినది. అంతేకాదు రాముని వీర్యమును, పరాక్రమమును కూడ అతి మధురముగా రావణునికి వర్ణిస్తుంది. రావణునికి బోధపరిచి సఫలమైన ఒకే ఒక వ్యక్తి శూర్పణఖ. ఏమిటా బోధ? నేను దక్షిణము నుండి ఉత్తర దిక్కుకు పోయి జ్ఞానోదయము పొందినాను. నీవు కూడ ఉత్తర దిక్కుకు పోయి రమ్ము. ఆయనము అనగా కాలము, దిశ, దిక్కు చూపునది. రామాయణము అనగా అందలి వివిధ పాత్రలకు దిక్కు, దిశ నిర్ధారించెడిది అని అర్థము. దిక్కు చూపెడివారెవరు?

గురువే. సీతా రామలక్ష్మణులకు ఆకస్మికముగా ధూమావతి అంశగల మంధర దక్షిణ దిక్కు చూపినది. అదే విధముగా వ్యోమకేశి అంశతో గురుస్థానము అలంకరించిన శూర్పణఖ, రావణునికి ఉత్తరదిక్కు చూపినది. ఉత్తర ముఖము గల శివుడు తంత్రములకు, క్షుద్రవిద్యలకు అధిదేవుడు అయిన వ్యోమకేశుడు కదా! వామాచారములో వున్న రావణుడు, శూర్పణఖ గురు అంశలోని 'వ్యోమకేశీ' బోధనను స్వీకరించాడు. ఉత్తర దిశగా పోతే ఏమి దొరుకుతుంది? రామ అంటే దక్షిణములోని నారాయణి భూతత్వము ఉత్తరములోని పంచబ్రహ్మల భూతత్వములో లయమగుట. అనగా దేహములోని శివశక్తుల సామరస్యము రామ అయినది. కావున రావణుడు దక్షిణము నుండి ఉత్తరమున గల రాముని చేరితే, రావణునిలో కూడ శివశక్తుల సామరస్యము కలుగవచ్చును అని హితబోధ చేస్తుంది. నీవు అన్వేషిస్తున్న, నీ చెయిజారిన గుప్త కుండలిని శక్తి నిధితో కూడి సీతా రామలక్ష్మణులు నీ కోసము ఉత్తరము నుండి బయలుదేరి సగము దూరము చేరారు. నీ కొరకు, నీ రాక కొరకు ఎదురు చూస్తున్నారు. కావున నీవు కూడా సగము దూరము ప్రయాణించి వారి అనుగ్రహమునకు పాత్రడవుకమ్ము, అని చక్కటి సందేశాత్మకమైన ఉపదేశము రావణునికి అందించినది, శూర్పణఖ.

శూర్పణఖను ప్రసన్నము చేసుకుంటే తక్కువ కాలములో ఎక్కువ ఫలితము కలుగుతుంది. వామాచారములో పండి పరిపక్వత పొందుతారు. త్వరిత గతిన జ్ఞానోదయము కలుగుతుంది. అంతేకాదు, రావణుని అనుగ్రహము, సీతా రామలక్ష్మణుల కృపకు కూడా పాత్రులవగలరు. ఈ శీర్షిక పఠించి ఈ క్రింది మంత్రము పఠించవచ్చును.

***"కామరూపిణి లంఖిణీ శ్రీరామ మోహిన్యై నమః"***

❖ ❖ ❖



***శ్రీ సీతాపతయే శ్రీరామ చంద్రాయ నమః***

## పదహారవ అధ్యాయము

# రామాయణములోని గుహుని పాత్ర విశేషాంశములు

గుహుడు నిషాధరాజు అనగా బోయలకు, ఆటవికులకు రాజు, బోయవాడు, ఆటవికుడు. ఈయన రాజధాని శృంగిబేరపురము. శృంగి అనగా శృంగములు కలది దుప్పి. అరణ్యములోని వన్య సంపద అయిన లేళ్లు, దుప్పులను, ఇతర జంతువులను పట్టి, సంపాదించి జీవనయాత్ర సాగించువాడు. గుహ అను పదము విశ్లేషిస్తే, బృహస్పతి అయస్కాంత శక్తి విష్ణుగ్రంధిలో కేంద్రీకృతమై వుండి, బ్రహ్మగ్రంధిలో వ్యక్తమైన చంద్ర మండల భువనేశ్వరి లోకములోని కాంతి పుంజము. కాబట్టి గురు అంశ గలవాడని అర్థము. అందుకే గుహుడు నిర్మలుడు, సచ్ఛీలుడు, స్నేహపాత్రుడు, కల్లాకపటము లేనివాడు. స్వామి భక్తి పరాయణుడు. అంటే చక్రవర్తి పట్ల వుండవలసిన భక్తి, నమ్రత, నమ్మకము, అభిమానము అన్నీ ఇతనిలో వున్నవి. తను నమ్మిన వారికి, తనను నమ్మిన వారికి ప్రాణములు ఇచ్చి కాపాడేటంతటి మంచి నడత గలవాడు. అలాంటి ఉత్తమ గుణములు గల గుహుడు, రాముడు సీతా లక్ష్మణ సమేతుడై తన ప్రాంతానికి వచ్చాడని తెలిసి, తన అనుచరులతో రాముని దర్శనానికి వస్తాడు. అయితే రాముడు మాత్రము తక్కువా?

***"తతో నిషాదాధిపతిం దృష్ట్వా దూరాదుపస్థితమ్,***
***సహ సౌమిత్రిణా రామః సమాగచ్ఛద్గుహేన సః".***

నిషాధిపతియైన గుహుడు తన దర్శనానికి వస్తున్నాడని చూచి, రాముడు లక్ష్మణునితో సహా ఎదురు వెళ్లాడు. అయితే గుహుడు వూరికే చేతులూపుకుంటూ రాలేదు. మరి ఎలా వచ్చాడు? పెద్దవారి వద్దకు, స్త్రీల వద్దకు, రోగగ్రస్థులైన వారి వద్దకు, పిల్లల వద్దకు, దేవుని వద్దకు ఉత్తచేతులతో వెళ్లకూడదనే నియమాన్ని పాటించాడు. అయితే గుహుడు ఏమి తెచ్చాడు? ఏమి తేవాలి? 'పత్రం, పుష్పం, ఫలం, తోయం' తనకున్న దానిలో ఆకు, పువ్వు, పండు, ఆఖరకు నీరు అయినా తీసుకువెళ్లాలి. అయితే 'పత్రం, పుష్పం, ఫలం, తోయం' అనే అంశము

అంతర్గతమైనది కానీ బహిర్గతమైనది కాదు. దీనిని గురించి 'మూఢ నమ్మకాలు, అంధవిశ్వాసములు' శీర్షికలో చర్చించబడినది.

అనాగరికుడు అయిన గుహుడు రాముని వద్దకు వస్తూ ఏమి తెచ్చాడు?

**"స్వాగతం తే మహాబాహో తవేయమఖిలా మహీ,**
**వయం ప్రేష్యా భవాన్ భర్తా సాధు రాజ్యం ప్రశాధి నః".**

పూర్వము రాముడు చేసిన ఘనకార్యములు, తాటకి వధ, సుబాహు వధ, శివధనుర్భంగము, అహల్య శాపవిమోచనము, పరశురాముని తిరస్కరించుట మొదలైనవి గుహుని మనసులో మెదలగా, అవి తలుచుకుంటూ, పొడవైన చేతులు గలవాడా, మహాబాహు అని రాముని ఉద్దేశించి పిలిచాడు. అంతేకాదు, పొడవైన చేతులు దూరముగా వున్న శత్రువును శిక్షించుటకు, దూరముగా వున్న ఆప్తులను దగ్గరకు చేర్చుకొనుటకు ఉపయోగపడతాయి. ఇంతేనా! మహాబాహు అనగా చేతులు ఎంత పొడుగుగా వుంటే, అంత అధిక వేగముతో కుండలిని శక్తి బయటకు వెలువడుతుంది. 'మహాబాహు' అని సంబోధించుటచే రామునికి అపరిమితమైన కుండలిని శక్తి గలదని భావము. మరి అపరిమితము కాకపోతే, ఐదు వేల మంది మహాయోధులచే లాగబడిన శివధన్నును ఎలా విరవగలడు? దీనిని బట్టి ఆటవికుడు, బోయవాడు, అనాగరికుడు, నీచజాతివాడైన గుహునకు రాముని కుండలిని శక్తి ప్రభావము, మహిమ గురించి పరిచయమున్నది అని అర్థమగుచున్నది. అనగా కుండలిని శక్తి ఉపాసన చేయటానికి, కుండలిని శక్తి ప్రసరణ సాధించుటకు ఉచ్ఛ, నీచ, పశు, మానవ, స్త్రీ, పురుష భేదము, నియమము ఏ మాత్రము లేదు. కుండలిని శక్తి విశ్వవ్యాపకము కదా!

మరి రాముడు లక్ష్మణ సమేతుడై, నీచ జాతివాడైన గుహునికి ఎదురు వెళ్లాడంటే అర్థమేమిటి?

గుహుడు రామునితో, నీకు స్వాగతము అని పలికి, 'త్వమేయ మఖిలామహీ' అంటే ఈ భూమి అంతా నీది. నీకు చెందినది. మేమందరము నీ సేవకులమే. నీవు మాకు భర్తవు, పోషకుడవు, రక్షకుడవు కూడా. ఈ రాజ్యము, ఇక్కడ వున్న జనము అంతా నీవారమే. నీ వారిని, నీ రాజ్యమును నీవే పాలింపుము, రక్షింపుము, పోషింపుము. ఇక్కడ రాముని కేవలము రాజుగా, రాజకుమారునిగా, స్నేహితునిగా గుహుడు భావించాడా? అలా భావించి వుంటే, రాజైనవాడు, రాజకుమారుడు ఒక పరిమితి విస్తీర్ణము గల భూమికి అధికారము గలవాడౌతాడు. కానీ గుహుడు 'త్వమేయ మఖిలా మహీ', ఈ ప్రపంచము అంతా నీదే అన్నాడు. అంటే అపరిమితము సూచిస్తున్నది. ఒక రాజు ఈ జగతికి మొత్తానికి అధికారి కాజాలడు, కాలేడు. అలాకాక, ఈ జగతికి మొత్తానికి నీవే అధికారివి అనే వుద్దేశముతో అన్నాడా అనుకుంటే, రాముడు విష్ణ్వాంశ సంభూతుడని గుహుడు భావించి యుండవలెను. అంతేకాదు, ఈ భూమి అంతా నీదే అనుటచే, అప్పటికే రావణుని పీడ

వలన ప్రబలిన భరతఖండము భూమాత అసహనమును రామునికి గుర్తు చేస్తున్నాడు. రాముని అవతార అంశ అయిన వరాహావతారమును రామునికి గుర్తు చేస్తున్నాడు. అందుకే గదా ఇంత, అంతని పరిమితి, కొలత సంబంధము లేకుండా 'మహాబాహు' అని సంబోధించాడు. అదే నిజమైతే, ఈ జగత్తు మొత్తమునకు రాముడే అధికారి గదా! అంతా ఆయనదే గదా! 'శ్రీరామరక్ష సర్వజగద్రక్ష' అనే భావన, చింతన గుహునిలో ఉన్నట్లు కనపడుతున్నది. దీనినిబట్టీ విశ్వామిత్రుడు, భరద్వాజుడు, శరభంగ మహర్షి, వాల్మీకి మహర్షి, అగస్త్యుని వలే గుహునికి కూడ రామావతార మహాత్యము, కుండలిని శక్తి ఉపాసన పద్ధతి తెలిసివుండాలి.

బహిర్గతముగా చూస్తే రాముడు ఒక చక్రవర్తి కుమారుడు, మరొక చక్రవర్తికి అల్లుడు. క్షత్రియుడు. గుహుడు సామంతరాజు, పైగా బోయవాడు. గనుక చక్రవర్తి కుమారుని దర్శనానికి రావటం సమంజసమే. రాముడు చక్రవర్తి కుమారుడైనా, ఈ రోజున రాజ్యము లేదు. రాజు కూడా కాదు. అందువలన గుహుడు రాముని దర్శనానికి వెళ్లవలసిన అవసరము లేదు, పనిలేదు. అలాగే రాముడు కూడా ఒక చక్రవర్తి కుమారుడై వుండి, మరొక సామంత రాజుకు ఎదురు వెళ్లవలసిన పనిలేదు. రామునికి ఈ రోజు రాజ్యము లేకపోయిననూ, రాజు కాక పోయిననూ, పద్నాలుగు సంవత్సరముల తర్వాత రాజుకాగలడు. అయితే గుహుడు, రాముడు ఈ విషయములేమీ ఆలోచించలేదు. స్నేహమునకు, నడవడికి, వ్యక్తిత్వమునకు ప్రాధాన్యత నిచ్చారు. గుహునిలో వుండే నమ్రత, భక్తి, స్నేహభావము, కపట గుణములేని స్వచ్ఛత రాముని ఆకర్షించినవి. రాముని చతుఃషష్టి గుణములు, రూపము, నడత గుహునికి నచ్చినవి. అందుచేత వారిరువురు పరస్పరము గౌరవించుకున్నారు. పరస్పరము వశమైనారు. ఇంకా స్పష్టముగా చెప్పాలంటే శివధనుస్సు విరిచిన విష్ణ్వంశ గల రాముడు, సీతాలక్ష్మణ సమేతముగా శివాంశ గల గుహుని సందర్శించినాడు. అలా వచ్చిన గుహుడు

***"భక్షం భోజ్యం చ పేయం చ లేహ్యం చేద ముపస్థితమ్,***
***శయనాని చ ముఖ్యాని వాజినాం ఖాదనం చ తే".***

తినటానికి, త్రాగటానికి, నాకటానికి, పడక ఏర్పాట్లు, అశ్వాలకు ఆహారము వీటన్నటినీ సిద్ధము చేసుకొని, రాముని దర్శనానికి వచ్చాడు. రాముని పట్ల తన స్నేహము, ప్రేమ మాటల ద్వారా కాకుండా, క్రియా రూపములో ప్రదర్శించాడు. సేవా భావముతో స్వాగతము పలికాడు.

***"తమార్తః సంపరిష్వజ్య గుహో రాఘవమబ్రవీత్,***
***యథా- యోధ్యా తథేయం తే రామ కిం కరవాణి తే,***
***ఈదృశం హి మహాబాహో కః ప్రాప్స్యత్యతిథిం ప్రియమ్".***

తనలోని పింగళనాడి తీవ్రముగా స్పందిచినదై, ఆర్తి చెందిన గుహుడు, రాముని వైపు సాగి రాముని కౌగిలించుకొని ఇట్లు పలుకుతాడు. రామా! నీకు అయోధ్య నగరము ఎంతటి స్వేచ్ఛ, ఇష్టము కలిగించునో, ఈ నగరము కూడ అలాగే అని భావించుము. ఓ ఆజానుబాహూ! నీ వంటి ప్రియమైన అతిథి మరెవ్వరికైన దొరుకునా? గుహుడు చేసిన చర్యకు, ప్రతిచర్యగా రాముడు

***"భుజాభ్యాం సాధు పీనాభ్యాం పీడయన్ వాక్యమబ్రవీత్,***
***దిష్ట్యా త్వాం గుహ పశ్యామి అరోగం సహబాన్ధవైః.***
***అపి తే కుశలం రాష్ట్రే మిత్రేషు చ ధనేషు చ".***

బలిసి వున్న తన భుజములలో గుహుని పూర్ణవంతముగా కౌగిలించుకొని, అనగా హృదయ స్పర్శ చేసిన రాముడు గుహునితో, నీవు, నీ బంధువులు ఆరోగ్యముగా, సుఖముగా వుండగా, నేను మిమ్ములను దర్శించుట నా భాగ్యముగా భావిస్తున్నాను. నీ దేశము, నీ మిత్రులు, ధనము క్షేమమే కదా! ఇక్కడ రాముడు ప్రస్తుతం రాజుగా పాలించక పోయినప్పటికీ, పాలించే ప్రభువు లక్షణము ప్రదర్శించాడు. గుహుడు అందజేసిన హృదయ స్పందనకు ప్రతిగా, తన హృదయ స్పందన గుహునికి తిరిగి పంపించాడు.

*భరతుడు గుహుని వద్దకు వచ్చినప్పుడు*

***"మహతీయమితః సేనా సాగరాభా ప్రదృశ్యతే,***
***నాస్యాన్తమధిగచ్ఛామి మనసాపి విచిన్తయన్".***

ఇటువైపు సముద్రము వలే, విశాలమైన గొప్ప సైన్యము కనుపడుచున్నది. ఆ సైన్యము విస్తీర్ణము ఎంతమేరకు వున్నదో ఊహకు కూడా అందటము లేదు.

***"యధా తు ఖలు దుర్బుద్ధిర్భరతః స్వయమాగతః,***
***స ఏష హి మహాకాయః కోవిదారధ్వజో రధే".***

పెద్ద ఆకారముతో కూడిన కోవిదారధ్వజము రథముపై కనుపడుచున్నది. దానిని బట్టీ ఈ సైన్యము పాపాత్ముడైన, పాపపు పనులు చేయువాడైన, చెడు ఆలోచనలు గల భరతునిదే అని స్పష్టము అగుచున్నది. భరతుడే సేనా సమేతుడై, స్వయముగా విచ్చేసాడు. అంటే రాముని వనవాస యాత్రలో భరతుని పాత్ర వుండి వుంటుందని, రాజ్య కాంక్షతో భరతుడే రాముని దేశ బహిష్కరణ చేయించి వుంటాడని, గుహుని ఆలోచన. దశరధుని రాజ్య సరిహద్దులలో నివసిస్తున్న గుహునికి, రాముని నడత గురించి తెలిసినపుడు, భరతుని నడత గురించి తెలియదా? గుహుడు,

భరతుని ఎందుకు అనుమానించినట్లు? మొదటి నుండి భరతుడు, రాముని భక్తుడే. కానీ ఈ మధ్య జరిగిన సంఘటన వలన భరతుని అనుమానించవలసి వచ్చినది. తల్లికొడుకులు కూడ పలుక్కొని, పథకము వేసి, భరతుడు లేని సమయములో తల్లి కైక ద్వారా రాముని అడవికి పంపియుండవచ్చును అని గుహుని ఊహ. అపరిమితమైన సేవాభక్తి, స్నేహభక్తి గలవారిలో ఇలాంటి అనుమానములు కల్గుట సర్వ సాధారణము. అలా అనుమానించిన గుహుడు తన పరివారముతో

*"బన్ధయిష్యతి వా దాశానధ వాస్మాన్వధిష్యతి,*
*అధ దాశరథిం రామం పిత్రా రాజ్యాద్వివాసితమ్.*
*సంపన్నాం శ్రియమన్విచ్ఛంస్తస్య రాజ్ఞః సుదర్లభామ్,*
*భరతః కైకయీపుత్రో హన్తుం సమధిగచ్ఛతి".*

కైక కుమారుడైన భరతుడు ఇంత సైన్యముతో ఎందుకు వచ్చినట్లు? రాముని అరణ్యానికి పంపటానికి వత్తిడి చేసిన కైకను, దుర్భాషలాడి, వ్యతిరేకించిన దశరధుని ముందుగా బంధించి, తర్వాత రాముని ఇష్టులైన వారిని ఒక్కొక్కరుగా బంధించి లేక చంపి, రాముని ఒంటరివాని చేసి, తర్వాత రాజ్యము స్వాధీనము చేసుకొనవలెననే ప్రణాళిక అయి వుండవచ్చును. అప్పుడు భరతుని లక్ష్యము చాలా సులభముగా పూర్తి అవుతుంది. అందుచేత మనలను బంధించటానికి లేక చంపటానికి సైన్యముతో తరలివచ్చి వుండవచ్చును, అని తన అనుచరులతో

*"భర్తా చైవ సఖా చైవ రామో దాశరధిర్మమ,*
*తస్యార్థకామాః సన్నద్ధా గఙ్గానూపే ప్రతిష్ఠత:'*

రామడు నాకు పోషకుడు, రక్షకుడు మాత్రమే కాదు, ప్రభువు, స్నేహితుడు కూడా. అందుచేత నేను ఆయనను కాపాడవలసియున్నది. కావున నా అనుచరులందరు గంగానది తీరములో జాగురూకతతో నిలిచి యుండవలసినది. ఇక్కడ 'ప్రతిష్టతి" అనుటచే వూరికే నిలిచి వుండుట కాదు. శత్రువు యొక్క కదలికలు పసిగడుతు, దానికి ప్రతిచర్య మనము ఏమి చేయవలెనో, ఎప్పుడు, ఎక్కడ శత్రువు ఏమి చేస్తున్నాడో, వేయి కళ్లతో గమనిస్తూ నిలవాలని అర్థము. అంతేకాదు

*"నావాం శతానాం పఞ్చానాం కై వర్తానాం శతం శతమ్,*
*సన్నద్ధానాం తథా యూనాం తిష్ఠన్త్విత్యభ్యచోదయత్."*

అయిదు వందల పడవలలో, పడవకు వందమంది చొప్పున కవచములు, ఆయుధములు ధరించి అస్త్రవిద్యలో నిపుణులైన యువకులు ఏ పరిస్థితినైన ఎదుర్కొనుటకు సిద్ధముగా వుండవలెనని ఆదేశమును జారీ చేస్తాడు. ఎంతటి స్వామిభక్తి!

***"యదాఽ దుష్టస్తు భరతో రామస్యేహ భవిష్యతి,***
***సేయం స్వస్తిమతీ సేనా గఙ్గామద్య తరిష్యతి".***

రాముని పట్ల భరతునికి దుష్ట స్వభావము లేదని, స్నేహపూర్వకముగానే రాముని వద్దకు వెళుతున్నాడని తెలిసిన తర్వాతనే, ఈ సైన్యము గంగను దాటకలదు. అలాకాకుండా చెడు ఉద్దేశము వుంటే గంగను దాటు లోపునే, వారిని మట్టుపెట్టాలని సూచన.

భరతుని అక్షౌహిణి సైన్యమును, గుహుడు ఐదువందల నావలు, నావకు వంద మంది చొప్పున, అనగా యాభై వేల మందితో అడ్డుకోవటము సాధ్యమా? అలాంటి సాహసోపేతమైన ఆలోచన గుహుడు ఎలా చేయగలిగాడు? శత్రువుల బలాబలములు తెలుసుకోకుండా, యుద్ధ సన్నాహములు చేయవచ్చునా? రాముడు తన వద్దకు వచ్చినప్పుడు, ఆయన క్షేమము, అభివృద్ధి, సుఖము కోరి తన రాజ్యమునే అర్పిస్తానన్నాడు గుహుడు. ఇప్పుడు రాముని రక్షణ కొరకు ప్రాణత్యాగానికే సిద్ధపడుతున్నాడు. అనగా గుహుడు ఇక్కడ సంఖ్యాపరముగా బలాబలాలను విశ్లేషణ చేయలేదు. కానీ ఆటవికులైనందున, పొంచి వుండి మీద దుమికి శత్రువును దెబ్బతీసే, ఆశ్చర్యకరమైన రణనీతిలో ఆరితేరిన వారై యుండవచ్చును. ఈ విధముగా ఆలోచన చేసిన గుహుడు, తన ఏర్పాట్లు చేసుకొని, తానుగా ముందుగా తొందరపడకుండా, భరతుని అభిప్రాయము తెలుసుకోవాలని, భరతుని సమీపిస్తాడు. అది ఏ విధముగా

***"అస్తి మూలం ఫలం చైవ నిషాదైః సముదాహృతమ్.***
***అర్ధం చ మాంసం శుష్కం చ వన్యం చోచ్చావచం మహత్."***

దుంపలు, పండ్లు, పచ్చివి, ఎండినవి, ఉడికినది అయిన మాంసముతో భరతుని సమీపిస్తాడు. తన మనసులో భరతుని గురించి అనుమానము వున్నా, బయటపడకుండా, అవతలి వ్యక్తికి తన మనసులోనిది తెలియకుండ ప్రవర్తించాడు. అంతేకాదు, అవతల వ్యక్తిలోని భావన, వుద్దేశము తెలుసుకొనుటకు ప్రయత్నిస్తాడు. భరతుని సమీపించిన గుహుడు, భరతునితో ఇలా ప్రశ్నిస్తాడు

***"కచ్చిన్న దుష్టో వ్రజసి రామస్యాక్లిష్టకర్మణః,***
***ఇయం తే మహతీ సేనా శఙ్కాం జనయతీవ మే."***

నీవు నీ తల్లి ద్వారా అనాయాసముగా పొందిన రాజ్యమును పాలించవలసిన వాడవు కదా! ఈ విధముగా, ఇంత సైన్యముతో రావటానికి గల కారణమేమిటి? శ్రమపడకుండా పనులు సాధించే నీవు, రామునికి హాని తలపెట్టే ప్రయత్నము చేయుట లేదు కదా? నీ విశాలమైన సైన్యమును చూచినంతనే నాకు అనుమానము కలుగుచున్నది, అని అడుగుతాడు. అంతటి నమ్మకమైన, విధేయుడైన స్నేహితుడు గుహుడు, రామునికి. అందుకే రావణ సంహార అనంతరము అయోధ్యకు

తిరిగి వచ్చే సమయములో, రాముడు హనుమంతునితో

***"చిన్తయిత్వా తతో దృష్టి వానరేషు వ్యపాతయత్,***
***ఉవాచ ధీమాంస్తేజస్వీ హనూమన్తం ప్లవఙ్గవమ్."***

వనవాసము ముగిసిన మరుసటి రోజు భరతుని ఎదురుగా వుంటానని వాగ్దానము చేసిన రాముడు, ఆ మరుసటి రోజున భరద్వాజ ఆశ్రమము వరకే చేరగలిగాడు. భరద్వాజ మహర్షి కోరిక మేరకు ఆయన ఆశ్రమములో బస చేసాడు. కాబట్టీ ఈ పరిస్థితులలో భరతునికి తన రాక వర్తమానము ఎలా పంపటమా అని ఆలోచించి, వానరుల వైపు దృష్టి సారించిన రాముడు, బుద్ధిమంతుడు, తేజశ్శాలి, చెప్పిన పనిని చెప్పిన దానికంటే అధికముగా చేయగలిగినవాడు అయిన హనుమంతునితో

***"అయోధ్యాం త్వరితో గత్వా శీఘ్రం ప్లవగసత్తమః,***
***జానీవేం కచ్చిత్కుశలీ జనోనృపతి మన్దిరే".***

ప్లవగసత్తమః అనగా ఎగురగల వారందరిలో గొప్పవాడా! నీవు త్వరగా అయోధ్యను చేరి, రాజుగారి భవనములోని జనుల యొక్క అభిప్రాయము తెలుసుకొనుము. భరతుడు ఈ పద్నాలుగు సంవత్సరములలో రాజ్యము పాలించి, సుఖములకు అలవాటుపడి, ఆతనిలో రాజ్యకాంక్ష చోటు చేసుకుంటే లేక ప్రజలు భరతుని పాలనలో సుఖముగా, సౌఖ్యముగా, శాంతిభద్రతలతో వుండి, భరతుని పాలననే కోరుకుంటే, రాముడు అయోధ్య చేరనవసరము లేదు. కారణం, రాజ్య పాలకుడు ఎవరనేది ముఖ్యము కాదు. ప్రజల సుఖము, సౌఖ్యము, శాంతి, ఇవే ముఖ్యము. ఇవన్నీ భరతుని పాలనలో అయోధ్యవాసులకు లభిస్తే, రామునికి అంతకంటే కావలసినదేమీ లేదు. అందుకని రాముడు హనుమంతునితో అలా చెప్పి మార్గమధ్యములో

***"శృంగిబేరపురం ప్రాప్య గుహం గహనగోచరం,***
***నిషాదాధిపతిం బ్రూహి కుశలం వచనాన్మమ".***

శృంగిబేరపురమునకు వెళ్ళి అరణ్యములో నివసించు నిషాధిపతియైన గుహుని కలిసి, నా మాటగా నా కుశలములు తెలియజేయుము.

***"శ్రుత్వాతుమాం కుశలి నమరోగం, విగత జ్వరమ్,***
***భవిష్యతి గుహః ప్రీతః సమమాత్మః సమసఖాః."***

నేను కుశలముగా, క్షేమముగా, రోగాలు నొప్పులు లేకుండా, మానసిక రుగ్మతలను తొలగించుకుని, అరణ్యవాసము పూర్తి చేసుకొని వస్తున్నాని విని, నాకు ఆత్మ సమానుడైన గుహుడు

సంతోషించును. అనగా శాశ్వతమైన బాంధవ్యము గలవాడని అర్థము. ఆత్మ శాశ్వతమైనది, దేహము నశించునది, క్షణికమైనది. దేహముతో ఏర్పడిన స్నేహము, దేహముతోనే ముగుస్తుంది. ఈ కాలములో దేహములుండగనే, దేహముతో ఏర్పడిన సంబంధ బాంధవ్యాలు పరిసమాప్త మగుచున్నాయి. కానీ ఆత్మ ద్వారా ఏర్పడిన స్నేహము శాశ్వతమైనది. ఎల్లప్పుడూ, ఎల్లవేళలా, అన్ని చోటుల చెక్కుచెదరకుండ వుండును. అందుకే పద్నాలుగు సంవత్సరములు గడిచినా గానీ గుహుని యందు రామునిపై గల భావము, స్నేహము చెక్కు చెదరలేదు. ఈ అంశముపైనే సినీ గేయ రచయిత సి.నారాయణరెడ్డి, 'తనువులు వేరైనా దారులు వేరైనా, ఆ బంధాలే నిలిచేనులే' అని వ్రాసి తరించాడు.

అయితే సంబంధము దేహము వలన ఏర్పడినదా లేక ఆత్మ కలయిక వలన ఏర్పడినదా అని ఎలా గుర్తించటము? ఆత్మ సంబంధము శాశ్వతమైనది అగుటచే, ప్రమేయ పూర్వకముగా కాకుండా, అప్రమేయముగా ఇద్దరు వ్యక్తులు పొందే అనుభూతులు, ఆత్మసంబంధమును తెలియజేస్తుంది. ఉదాహరణకు నిద్రించునపుడు ఆత్మ సంబంధమైన వ్యక్తి కలలో అగుపించి కొన్ని సూచనలు జారీ చేయుట, క్లిష్టమైన సమస్యలో చిక్కుకున్నప్పుడు, ఆత్మ సంబంధమైన వ్యక్తి తన చెంత నుంటే పొందే ఆహ్లాదము తలచుకొని ఊరట కలుగుట, ఇవన్నీ ఆత్మ సంబంధములను తెలియజేస్తాయి. లంకలో వున్న సీత అంతర్గతముగా రాముని తలుచుకుంటూ, రామునికి వర్తమానములు పంపినది. అలాగే రాముడు కూడా సీతను తలుచుకున్నాడు. కావున వారిరువురిది ఆత్మ సంబంధము. అదే విధముగా రామ గుహుల సంబంధము, రామ హనుమంతుల సంబంధము కూడా ఆత్మ సంబంధములే. కేవలము ప్రమేయ పూర్వకముగా చేసెడి చింతన లేక కార్యములు, అంటే ఆ వ్యక్తి పుట్టినరోజు లేక వర్ధంతి రోజున ఆ వ్యక్తి చిత్రపటమునకు పూలమాలలు వేసి లేక మిఠాయిలను పంచి, మరుసటి రోజు ఆ వ్యక్తిని గురించి మరచిపోవుట, ఇటువంటివి దేహసంబంధమును సూచిస్తాయి. ఇటువంటి దేహసంబంధమైన ప్రక్రియల వలన ఏర్పడే సంకల్ప వికల్ప తరంగములు ఖండితమై, దేహమున్నా లేకున్నా ఆశించిన వ్యక్తి వద్దకు చేరవు. ఆత్మపరమైన సంబంధముతో కూడి చేసే ప్రక్రియల వలన ఏర్పడే సంకల్ప వికల్ప తరంగములకు సృష్టి సంకల్ప వికల్ప తరంగములు తోడై, వృద్ధి పొంది అఖండితమై, దేహమున్నా లేకున్నా ఆశించిన ఆత్మకు తప్పక చేరగలవు. ఈ ప్రతిపాదనకు నిదర్శనము, ప్రమాణికము చాలా మంది వ్యక్తుల నిజ జీవితములో చోటు చేసుకున్న ఆత్మపరమైన అనుభవాలే. కావున రాముని, గుహుని సంబంధము, రాముని శబరి సంబంధము, రాముని హనుమంతుని సంబంధము, రాముని జాంబవంతుని సంబంధము, చివరకు రాముని రావణుని సంబంధము కూడా ఆత్మ సంబంధములే. అయితే ఇక్కడ భరతుడు దాయాది, జ్ఞాతి. 'జ్ఞాతి హెూతాశనుండు' అని కదా. కానీ ఆ కాలములో సవతిపిల్లలైన, ఒక తల్లి పిల్లలుగా సఖ్యతగా ఎలా వుండగలిగారు? ఇది ఆత్మ సంబంధము.

రాముడు విష్ణు అంశ అయితే, లక్ష్మణుడు ఆదిశేషుడు, భరతుడు శంఖ, శత్రుఘ్నుడు చక్రము అంశలు గలవారు. తర్వాత రాముడు హనుమంతునితో

***"అయోధ్యా యాశ్చతే మార్గం ప్రవృత్తిం భరతస్య చ,***
***నివేదయిష్యతి ప్రీతో నిషాదాధిపతి ర్గుహః".***

నిషాధిపతి గుహుడు నీకు అయోధ్యకు మార్గము చూపుటయే గాక, సంతోషము పొందినవాడై, ఎందులకు సంతోషము? తన ప్రాణస్నేహితుడు, ప్రభువు పద్నాలుగు సంవత్సరముల తర్వాత క్షేమముగా, సుఖముగా, సంతోషముగా, రోగాలు నొప్పులు లేకుండా తిరిగి వస్తున్నాడని సంతోషము, భరతుని గురించి వృత్తాంతమును నీకు తెలియజేయగలడు. దీనినిబట్టి గడిచిన పద్నాలుగు సంవత్సరములు, గుహుడు అయోధ్యలోని విషయములను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నాడని అర్థమగుతున్నది. అయితే ఇక్కడ ఒక రహస్యాంశము, దక్షిణ దిక్కు గల లంకానగరము నుండి హిమాలయ పర్వతశ్రేణి వరకు వాయు వేగమున పయనించి, సంజీవిని ఔషధములను సేకరించి రాగలిగిన హనుమంతుడు, అలాగే సముద్రము లంఘించి లంకలోని సీతను వెదకగల్గిన హనుమంతుడు, ఇంచుమించు 20,000 కిలోమీటర్లు ఆకాశములో పక్షి విన్యాసము చేసిన హనుమంతుడు, అయోధ్య నగరమునకు మార్గము తెలుసుకొనలేడా? ఇది అసమంజసము, రాముడు ఇలా ఎందుకు చెప్పాడు?

అయోధ్య అనగా యోధులకు, వీరులకు సాధింపరానిది, శక్యము కానిది. అనగా నేనంతటి వాడిని, నేనింతటి వాడిని అనే భావనతో అయోధ్య చేరలేరు. హనుమంతుడు, గుహుడు కలుసుకునే సన్నివేశము ఒక అద్భుత రహస్య ఘట్టము. ఇలాంటి రహస్య ఘట్టములను వాల్మీకివారు బహిర్గతము చేయకుండా, గుప్తముగా వుంచి వాటి సారాంశమును కొన్ని ప్రత్యేక పదజాలముతో తెలియపరిచినాడు. ఉదాహరణకు గుహుడు హనుమంతునికి అయోధ్యకు మార్గము చెప్పుట. ఇలాంటి అంశములను వాల్మీకివారు ఎందుకు బహిర్గతము చేయలేదో వాల్మీకి వారికే తెలియాలి. బహుశా ఆనాటి దేశ కాల పరిస్థితులను అనుసరించి, భరతఖండములో ప్రబలుతున్న అసహనమును దృష్టిలో వుంచుకొని, ఇటువంటి రహస్యములను గుప్తముగా వుంచి వుండవచ్చును. అలాగే మరొక కారణము, జ్ఞానోదయము అయినవారు పఠించిన ఇందలి కీలకమైన ఘట్టములు, వారికి అవగతము అవవలెనని గుప్తముగా వుంచి వుండవచ్చును. ఏది ఏమైతేనేమి రామాయణము జరిగి ఇంతకాలము అయిన తర్వాత, అందులోని రహస్యములను బహిర్గతము చేయలేకపోవుట, మూర్ఖత్వము అవుతుంది. హనుమంతుడు, గుహుడు కలుసుకొనే సందర్భములోని ముఖ్యాంశము ఏమిటి?

గుహుడు శివాంశ సంభూతుడు. గంగను వశపరుచుకొని జీవనము సాగించుట ఎవరికి సాధ్యము? శివునికే సాధ్యము. గుహలో కూర్చుంటే ఏమి జరుగుతుంది? కొంతసేపటికి మన శ్వాసనిశ్వాసల సంకల్ప వికల్పముల తరంగములు గుహలోని పంచభూతములచే సమన్వయపడి, తేలికగా ధ్యానముద్రలోకి వెళ్లుటకు దోహదపడతాయి. అట్టి గుహలో ధ్యానము చేయగలిగినంత ధ్యానముద్ర గలవాడు గుహుడు కావున శివాంశ గలవాడు. అలాగే జింకను, గంగను వశపరుచుకొని ధ్యానముద్ర చేయగల్గిన వాడెవడు? ఆదిగురువు దక్షిణామూర్తి. కాబట్టీ గుహుడు దక్షిణామూర్తి అంశ. రాముడు వనవాసమునకు బయలుదేరుతూ దక్షిణదిక్కు ప్రయాణమునకు ముందుగా గుహుని దర్శించాడు. అనగా ఉత్తర దిక్కున గల దక్షిణముఖుడైన గుహుని అనుగ్రహము పొంది, ఆయన అనుమతితో, ఆయన అంశ అయిన రుద్రాంశ సంభూతుడు అగు హనుమంతుని దక్షిణదిక్కు మార్గములో రాముడు కలిసాడు. ఇక్కడ శివుడు అనగా శివశక్తుల సామరస్యముతో కూడి నిరంతర ధ్యానముద్రలో ఉన్నవాడు, దక్షిణామూర్తి అనగా శివశక్తుల సామరస్యములో లేని నిరంతర ధ్యానముద్రలో ఉన్నవాడు, రుద్రుడు అనగా ధ్యానముద్ర నుండి బహిర్గతమైన వాడు. ఎందుకు ధ్యానముద్ర నుండి బహిర్గతము అవుట? హనుమంతునికి వరదానము చేయుటకు, మన్మధుని మసి చేయుటకు, భస్మాసురునికి వరదానము చేయుటకు, లేక త్రిపురాసురుని సంహరించుటకు, మన కర్మాచరణలను లయము చేసుకొనుటకు ధ్యానముద్ర నుండి రుద్రాంశతో బహిర్గతము అవుతాడు. అట్టి రుద్రాంశ సంభూతుడగు హనుమంతుడు, ఆ రుద్రాంశ వలననే అసాధ్యమైన లంకపై లంఘించాడు. సగటు కంటే పదిరెట్లు, వందరెట్లు అహంకారము గల రావణుని అహంకారమును, రుద్రాంశతో లంకలో జొరబడి కలకలం సృష్టించాడు. యుద్ధము ముగిసినది. ఇప్పుడు ఇంక ఆ రుద్రాంశతోటి అవసరము లేదు. రుద్రాంశలో వున్న హనుమంతుడు అయోధ్య చేరలేడు. ధీరులు, యోధులకు సాధింపబడదు కదా అయోధ్య. అలాగే రాముడి రాజ్యమును రుద్రాంశతో లయము చేసుకొనుట కూడా అసాధ్యమే. మరి అయోధ్య ఎవరికి సాధ్యపడుతుంది? యోగులకు, ఋషులకు, ధ్యానములో వున్న వారికి సాధింపబడుతుంది. కావున రాముడు హనుమంతునికి తన రుద్రాంశను పరిత్యజించి, శివాంశను గ్రహించి అయోధ్యకు వెళ్లమని సూచించాడు. మరి రుద్రాంశను ఎవరు స్వీకరించగలరు? ఎక్కడ పరిత్యజించవలెను? అరణ్యములలో చెలరేగే మంటల ఫలితము ఎవరు స్వీకరిస్తున్నారు? భూకంప ప్రకంపనలను ఎవరు స్వీకరిస్తున్నారు? అరణ్యములో మంటల తీవ్రత కంటే, భూకంప తీవ్రత కంటే అధికమైన సహనము గల భూదేవి స్వీకరిస్తున్నది. అదేవిధముగా ఆప శక్యముగాని రుద్రాంశను ఆదిగురువైన దక్షిణామూర్తే స్వీకరించుటకు యోగ్యుడు. ఎక్కడైతే గంగను కూడా వశపరుచుకొని, జింకను వశపరుచుకొని తన దక్షిణామూర్తి అంశను ప్రకటించాడో, అక్కడ రుద్రాంశను పరిత్యజించవలెను. ఈ అద్భుత

రహస్య ఘట్టం హనుమంతుడు గుహుడు కలుసుకోవటము ద్వారా జరిగినది. ఈ పరస్పర కలయికలో గుహుడు, హనుమంతుని లోని రుద్రాంశను గ్రహించి, అయోధ్య చేరి, అక్కడి నుండి తిరిగి రాముని చేరుటకు ఎంతమేరకు రుద్రాంశ అవసరమో అంతమేరకు శేషము వదలి, మిగిలనదంతా తాను స్వీకరించాడు. గుహుని కలిసిన తర్వాత నుండి శివాంశ సంభూతుడైన హనుమంతుడు ధ్యానముద్రలోనే కాలం గడిపాడు. ఇప్పటికి కూడా హనుమంతుడు అన్ని అంశలను వదిలివేసి, కేవలము ధ్యానముద్రలోనే కాలము గడుపుతున్నాడు. హనుమంతునిలోని రుద్రాంశ ప్రేరణ కలిగించి, లంక యాత్రకు జాంబవంతుడు ఎంత ప్రోత్సహించాడో, అదేవిధముగా హనుమంతుని రుద్రాంశను తొలగించి, శివాంశను నింపి హనుమంతుని ధ్యాన నిమగ్నుడు అగుటకు గుహుడు కారణమైనాడు. ఎంతటి చక్కటి రహస్యాంశము.

అందులకే ఎంతో కష్టపడి పుట్టలు, గుట్టలు సీత కొరకు వెదికి, సముద్రము దాటి, లంకలోని సీతను కనుగొని, పేరు మోసిన రాక్షసులను సంహరించి, లంకను తగులబెట్టి, సీత వార్త రాముని చెవిన వేసి, ఇటు రాముని, అటు సీత దుఃఖము పోగొట్టిన హనుమంతునికి దొరికిన రాముని ఆలింగనము, ఏ శ్రమ లేకుండా, అనాపేక్షకముగా, అనాయాసముగా, అతి సునాయాసముగా గుహునికి దొరకిన గాఢమైన రాముని ఆలింగనము, శరీరము దాచకుండ యుద్ధము చేసి ఇంద్రజిత్తును చంపిన లక్ష్మణునికి అంత శ్రమపడిన తర్వాత కానీ లభించలేదు.

ఎంతటి పుణ్యాత్ముడో గుహుడు, ఎంతటి స్నేహశీల భక్తుడో గుహుడు. అలాంటి జన్మ ఎంత కాలము అక్కరలేదు. క్షణకాలము చాలును. ఆటవికుడైతేనేమీ, బోయడైతేనేమీ, అనాగరికుడైతేనేమీ, రాముని ఆలింగనము పొందినవాడు, గుహుడు.

**"ఉడుముండదే నూరేళ్లు, పడియుండదె పేర్మి పాము పది నూరేండ్లున్"** అని అన్నట్లు, ఎంతకాలము బ్రతికి ఏమి ప్రయోజనము? ఇదండీ గుహుని గురించిన విశేషాంశములు. మరి గుహుని లక్షణములను గురించి, ఆయనను ఏ విధముగా ప్రసన్నము గావించవలెనో, దానివలన కలిగే ఫలితముల గురించి క్లుప్తముగా తెలుసుకుందాము.

కైలాస ప్రాంగణములో రావణుడు చేసిన విపరీత ప్రక్రియ ద్వారా సృష్టి పోషణకు అవసరమైన వేయి సంవత్సరముల కుండలిని శక్తి, సృష్టి క్రమము నుండి విడిపోయినది. మహాకవి కాళిదాసు చెప్పినట్లుగా, 'జగతః పితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ', ఈ జగత్తుకు పితృ సమానులైన పార్వతి పరమేశ్వరులు కైలాసము నుండి విడిపోయారు. ఈ విధముగా పరమశివుడు కైలాసము నుండి దిగి ఒక రూపములో వ్యక్తమవాలంటే, ఒక అనాగరికుడుగా, బోయవాడుగానో, నీచ జాతి వానిగానో లేక ఎవ్వరికి సంబంధము లేని సన్యాసిగానో ప్రవేశించవలెను. ఆయన అసలు

రూపముతో ప్రత్యక్షమైన ప్రజలు ఊరుకుందురా? అలాగే రుద్రుడు ఒక రూపముతో రావలెనన్న నిలకడలేని, చపలచిత్తము గల్గిన కపి రూపములోనే ప్రవేశించాలి. కాబట్టీ శక్తి నుండి, పార్వతి నుండి విడిపోయిన శివుడు దక్షిణామూర్తి అంశలో గుహుడు అయినాడు. జింకను వశపరుచుకొని, గంగను వశపరుచుకొని, విష్ణ్వాంశ గల రాముని ఆలింగనము పొందినవాడు దక్షిణామూర్తి గాక ఇంకెవరు అవగలరు? గుహుడు ఆటవిక రాజుగా, బోయవానిగా గంగాతీరములో స్థిరపడ్డాడు. కావున ఈయనలో స్వచ్ఛత, స్నేహభావము, ప్రేమతత్వము సహజముగనే చోటు చేసుకున్నవి. రాముని విష్ణ్వాంశగా ఎరిగినవాడు, అంతేకాదు, రాముని అద్వైత రామునిగా కీర్తించిన మహామహుడు, గుహుడు. దక్షిణామూర్తి అంశకు తెలిసిందల్లా ఒక్కటే, అద్వైత సిద్ధాంతము. ఏమయ్యా రామా! తాటకిని ఒక్కేటిన కూల్చావట గదా? శివుని విల్లు ఒక దెబ్బకు విరిచావట? పరశురాముడు అంతటి వాడిని ఒక్క పర్యాయములోనే తిప్పిపంపావట? అంతే కాదు ముందు, ముందు వాలిని కూడా ఒక్క బాణముతో నేలకూలుస్తావు, రావణుని కూడా ఒక్క బాణముతోనే నిర్జిస్తావు. అవునండీ! రాముడు ప్రమేయపూర్వకముగా సంకల్పించి రావణునిపై ప్రయోగించినది ఒక్క బాణమే, మిగిలిన బాణములన్నీ రావణుడు ప్రయోగించిన బాణులకు ప్రతిచర్యగా వేసినవే. ఇవన్నీ ఒకవైపు అయితే, నీ ఏకపత్నీవ్రతము మరొక విశేషము. ఏమిటీ అద్వైతము? ఏమిటీ అర్ధనారీశ్వర తత్వము అని రాముని ప్రశ్నించాడు ఆలింగనముతోటే గుహుడు. అనగా శివుడు ఎవరి ఎదురుగా నిల్చుంటే, వారిలో శివుని లక్షణములు ప్రతిబింబిస్తాయి. ఇది స్ఫటికలింగ లక్షణము. కాబట్టీ రాముని అద్వైత రామునిగా కొనియాడిన ఏకైక పుణ్యమూర్తి, గుహుడు. అంతేనా, అంతేకాదు! హనుమంతుని శాంతపరిచి, ధ్యానయోగము వైపు మళ్లించిన దోహదకారి, గుహుడు. సీతారామ లక్ష్మణులకు దిక్కు చూపిన గురుదైవము, గుహుడు. మరియింతటి విశిష్ట గుణములు గల గుహునికి అతి తేలికగా రాముని ఆలింగనము దొరుకుటలో ఆశ్చర్యము ఏముంది? దక్షిణామూర్తి అంశను ఒక రూపముతో ఆరాధించవలెనన్న రామాయణములోని గుహుని పాత్ర పఠించవచ్చును. ఆదిగురువు అంశ అయిన గుహుడు సీతారాములకు ఇచ్చిన రహస్య ఉపదేశము ఏమిటి? నేను జింకను వశపరుచుకున్నాను. మీరు కూడా జింకను వశపరుచుకోండి, అని చెప్పాడు. అందుకే అరణ్యకాండలో మాయలేడి వెంట రాముడు పరిగెత్తాడు. గుహుడు ఇచ్చిన ఈ ఉపదేశముతో, రామాయణము ముందుకు సాగింది. దక్షిణామూర్తి హృదయ స్పందన, విశాల హృదయము గుణములు రాముని ఆలింగనము చేసుకొనుట ద్వారా, గుహుడు ఈ గుణములను రామునిలో ప్రవేశపెట్టాడు. ఈ శిక్షణ ఫలితముగానే, గుహుడు రాముని ఆలింగనము చేసుకుంటే, రాముడు కూడా హనుమంతుని అదేరీతిలో ఆలింగనము చేసుకొని, నేను ఇంతకంటే ఏమీ ఇవ్వలేనన్నాడు. మహాత్ముడైన గుహుని అనుగ్రహము కల్గితే రాముడు తప్పక మన వశమౌతాడు.

రాముడే కాదు, లక్ష్మణుడు, భరతుడు, గంగ, హనుమంతుడు మనస్సు అనే జింక  కూడా మన వశమౌతారు. ఈ గుహుని శీర్షిక పఠనము చేసి, ఈ క్రింది మంత్రములలో ఏదో ఒక మంత్రము ఎంపిక చేసి జపించవచ్చును.

***"స్పటికరూప శ్రీరామ సేవిత గుహాయ నమః"***

***"అద్వైతరామ సేవిత నిషాదాధిపతియే నమః"***

***"రామమిత్ర గురుగుహ దక్షిణామూర్తే నమః"***

***"రుద్రాంశ గ్రహణ శివాంశకారణ గుహే నమః"***

❖ ❖ ❖

